www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 307 | పేజీలు : 11 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | బుధవారం 17-07-2024

MHR TV
www. mhrtv.com





### విద్యుత్ కమిషన్
## చైర్మన్‌ను మార్చండి

- సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు
- కమిషన్‌ను రద్దు చేయాలన్న కేసీఆర్ పిటిషన్ పై విచారణ
- జడ్జి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచన
- నిబంధనలకు విరుద్ధంగా ప్రెస్ మీట్ పెడమేంటని వ్యాఖ్య
- సోమవారంలోగా నియమిస్తామని తెలిపిన ప్రభుత్వం

2

విలేకరులు కావలెను
ప్రజాస్వరం
పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.



సెల్ : 800 860 9999



కలెక్టర్లతో సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, పక్కనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి

### పారదర్శక, ప్రజాహిత
## పాలన అందించాలి

- మీరు తీసుకునే నిర్ణయాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలి
- క్షేత్రస్థాయిలో వారి ఆలోచనలేంటో తెలుసుకోవాలి
- సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీదే
- ఆరు గ్యారెంటీలను పారదర్శకంగా అమలు చేయాలి
- విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశానికి హాజరైన మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

- ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సచివాలయంలో కలెక్టర్లతో సమావేశం
- భవిష్యత్తు కార్యాచరణపై దిశా నిర్దేశం
- పాల్గొన్న మంత్రులు, సీఎస్ శాంతికుమారి

2

### అంగన్ వాడీలకు
## రిటైర్మెంట్ బెనిఫిట్స్

- టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష
- రెండు మూడు రోజుల్లో జీవో జారీ
- సిబ్బందికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క


5



### ముంబయి హైవే ఎక్స్ ప్రెస్ పై
## ఘోర ప్రమాదం

- ట్రాక్టర్ ను ఢీ కొట్టిన ప్రైవేటు బస్సు
- లోయలో పడిపోయిన రెండు వాహనాలు
- ఐదుగురు మృతి, 42 మంది తీవ్ర గాయాలు

2





### హైదరాబాద్‌లో
## టీ స్క్వేర్

- మరో ఐకానిక్ కట్టడానికి ప్రభుత్వం ప్రణాళికలు
- న్యూయార్క్ టైమ్ స్క్వేర్ తరహా నిర్మించేందుకు ప్రణాళికలు
- ఇప్పటికే టెండర్లు పిలిచిన టీజీఐఐసీ
- రాయదుర్గం, బయోడైవర్సిటీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే అవకాశం

6



### వందేభారత్
## స్లీపర్ రైలు

- ఆగస్టు నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నాహాలు
- తొలి రైలు సికింద్రాబాద్ టు ముంబయి
- రైల్వే బోర్డుకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రతిపాదన
- సికింద్రాబాద్-పూణే మధ్య శతాబ్ది స్థానంలో వందేభారత్..!

2

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- ఎన్నికల హామీని తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం
- రేషన్ కార్డు ప్రమాణికం చేయడం సమంజసం కాదు
- రేవంత్ సర్కారుపై విపక్షాల మండిపాటు
- రైతులు ఉద్యమిస్తారని హెచ్చరిక

2





## కవితకు అస్వస్థత

- జ్వరం, గైనిక్ సమస్యలతో బాధపడుతున్నట్టు అధికారుల వెల్లడి
- జైలు నుంచి దీన్ దయాళ్ ఆస్పత్రికి తరలింపు

2



### రేషన్ కార్డు లేకున్నా
## ఆరోగ్య శ్రీ సేవలు


- అన్ని వర్గాల వారికి వర్తింపజేయాలి
- విధి విధానాలు రూపొందించండి
- రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

### లిక్కర్ హోమ్ డెలివరీ.!

స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్ సంస్థల నిర్ణయం
త్వరలో అందుబాటులోకి సేవలు

7




### ఉగ్రదాడి...

జమ్మూ కశ్మీర్ దేస్సా ప్రాంతంలో ఎదురు కాల్పులు
నలుగురు జవాన్లు మృతి

2



### సాగర్.. డేంజర్ బెల్స్

పూర్తి స్థాయికి చేరిన నీటిమట్టం
లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు

2





# సాగర్.. డేంజర్ బెల్స్

**హైదరాబాద్, జూలై 16, (ప్రజాస్వరం) :** తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ లో కూడా నిన్న పలుచోట్ల భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో హుస్సేన్ సాగర్ లో నీటి మట్టం చాలా కాలం తర్వాత గరిష్ఠ స్థాయికి చేరుకుంది. దీంతో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, శానిటేషన్ సిబ్బందిని హుటాహుటిన రంగంలోకి దించారు. హుస్సేన్ సాగర్ గరిష్ఠ నీటిమట్టం 514.75 మీటర్లు కాగా... ప్రస్తుత నీటిమట్టం 513.41 మీటర్లుగా ఉంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పరిస్థితిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిన్న రాత్రి హైదరాబాద్ లో 8.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వరదనీటి కారణంగా పలు ప్రధాన రహదారులపై అక్కడక్కడ ట్రాఫిక్ జామ్ అయింది.

ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో హైదరాబాద్ లోని హుస్సేన్ సాగర్ నీటి మట్టాలు దాదాపు పూర్తి స్థాయికి చేరుకున్నాయి. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, శానిటేషన్ డిపార్ట్ మెంట్ సిబ్బంది నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి నిల్వలను తొలగించేందుకు కృషి చేస్తున్నారు.హైదరాబాద్ నగరంలో రాత్రి 10 గంటల వరకు సగటున 8.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రహదారులపై భారీగా వరద నీరు చేరింది. ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. కొన్ని చోట్ల కార్లు, ఆటోలతో పాటు ద్విచక్ర వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి.

# ఉగ్రవాదులు కాల్పులు

## జమ్మూ కశ్మీర్‌లో నలుగురు జవాన్లు మృతి

శ్రీనగర్ జూలై 16 : జమ్మూ కశ్మీర్ లో దోడా జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్లు అమరులయ్యారు. దెస్సా ప్రాంతంలో సోమవారం రాత్రి భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో అధికారితో సహా నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రవాదుల కోసం భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. దెస్సా ప్రాంతంలో తీవ్రవాదులు సంచరిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. గత వారం కఠువా జిల్లా మాచేడీలో సైనిక వాహనంపై తీవ్రవాదులు కాల్పులు జరపడంతో ఐదుగురు జవాన్లు మృతి అమరులైన సంగతి తెలిసిందే. జమ్ము కశ్మీర్ గత రెండున్నర సంవత్సరాల నుంచి 40 మంది సైనికులు చనిపోయారు.

# ముంబయి హైవే ఎక్స్ ప్రెస్ పై రోడ్డు ప్రమాదం

## ట్రాక్టర్ ను ఢీ కొట్టిన బస్సు.. ఐదుగురు మృతి

ముంబయి జూలై 16 : మహారాష్ట్రలోని ముంబయి హైవే ఎక్స్ ప్రెస్ పై మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేటు బస్సు ట్రాక్టర్ ను ఢీకొట్టడంతో రెండు వాహనాలు 20 అడుగుల లోతుగల లోయలో పడ్డాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా 42 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. ఆషాడం ఏకాదశి సందర్భంగా భక్తులు పందార్ పూర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## పారదర్శక, ప్రజాహిత..

# పాలన అందించాలి

- మీరు తీసుకునే నిర్ణయాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలి
- సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీదే
- విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి
- ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సచివాలయంలో కలెక్టర్లతో సమావేశం ప్రభుత్వ పథకాలపై దిశా నిర్దేశం

**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం) :** తెలంగాణలో ఉన్న కలెక్టర్లలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చినవారున్నారని, వారంతా ఇక్కడి సంస్కృతిలో భాగస్వామ్యమవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను అమలు చేసే బాధ్యత కలెక్టర్లదేనన్నారు. కలెక్టర్లు ప్రభుత్వానికి కళ్లు, చెవులు లాంటి వారన్నారు. గతేడాది డిసెంబర్ 24న తొలిసారి నిర్వహిం చిన కలెక్టర్ల సమావేశంలో ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించి నిజమైన లబ్ధిదారుల్ని గుర్తించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగియగానే కలెక్టర్ల బదిలీలను పారద ర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కలెక్టర్లు తెలంగాణను తమ సొంత రాష్ట్రంగా భావించి పనిచేయాలని సూచించారు. తీసుకునే నిర్ణయాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని చెప్పారు. ఒక శంకరన్, శ్రీధరన్ లా.. సామాన్య ప్రజలు కలెక్టర్లను గుర్తుంచుకునేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. పాలనపై ప్రజల ఆలోచనలేంటో క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలన్నారు. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే.. ఎలాంటి సంతృప్తి ఉండదన్నారు. కలెక్టర్లు తీసుకునే ప్రతీచర్య ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలన్నారు.ఈ ప్రభుత్వంలో పారదర్శకమైన ప్రజాహిత పాలనను అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కలెక్టర్లదేనన్నారు. తెలంగాణ పునర్నిర్మాణానికి విద్యావ్యవస్థ అత్యంత కీలకమన్న సీఎం.. విద్యావ్యవస్థ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని ఆదేశించారు. ప్రతి పేద విద్యార్థి కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.85 వేలు ఖర్చు చేస్తోందని తెలిపారు. అలాగే ప్రభుత్వ స్కూళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్ని పర్యవేక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలని తెలిపారు. కొన్ని ప్రభుత్వ స్కూళ్లలో టీచర్లు బదిలీలపై వెళ్తుంటే.. విద్యార్థులు కంటతడి పెట్టుకున్న ఘటనలున్నాయని, కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజల నుంచి ప్రజావాణికి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వమని ప్రజలకు నమ్మకం కలిగేలా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు.

**ప్రజల్లోకి మీరు తీసుకువెళ్లాలి**

ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు సంక్షేమ పథకాలు కొన్ని జిల్లాల్లో కింది స్థాయి వరకు వెళ్లడం లేదనీ.. రైతు భరోసా అభిప్రాయ సేకరణ కోసం జిల్లాలకు వెళ్లినప్పుడు ఈ విషయం అర్థమైంద న్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని పది లక్షలకు పెంచడం, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలపై విస్తృతంగా ప్రచారం చేసి అర్హులందరికీ ఆ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఇది ప్రజా పాలన, ప్రజా ప్రభుత్వం అనే సందేశాన్ని స్పష్టంగా ప్రజాక్షేత్రంలోకి తీసుకువెళ్లాలని సూచించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు విస్తృతంగా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తే పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతాయన్నారు. ఇక సమావేశ ఎజెండాలో తొమ్మిది అంశాలను చేర్చారు. ప్రధానంగా డ్రగ్ వ్యతిరేక ప్రచారం, వ్యవసాయం – కాలానుగుణ పరిస్థితులు, ఆరోగ్యం, లా & ఆర్డర్ సెక్యూరిటీ సంబంధిత సమస్యలు, మహిళా శక్తి, విద్య, ధరణి , ప్రజా పాలన , వన మహోత్సవంపై చర్చించారు.




# వందే భారత్ స్లీపర్ రైలు

- ఆగస్టు నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు దక్షిణ మధ్య రైల్వే సన్నాహాలు

చెన్నై, జూలై 16 : ప్రస్తుతం దేశమంతా వందేభారత్ సర్వీసులకు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. దీంతో ఇండియన్ రైల్వేస్.. వచ్చే నెల నుంచి వందేభారత్ స్లీపర్ రైళ్లను పట్టాలెక్కించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సికింద్రాబాద్ నుంచి తొలి వందేభారత్ స్లీపర్ రైలు పరుగులుపెట్టే అవకాశం ఉందట. ఈ రైలు సికింద్రాబాద్ టూ ముంబై నగరాల మధ్య నడుస్తుందని తెలుస్తోంది. ఈ మేరకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దక్షిణ మధ్య రైల్వే జీఎంకి సూచించారు. ఈ మేరకు ఆయన రైల్వే బోర్డుకు ప్రతిపాదన పంపించారని తెలిసింది. అటు సికింద్రాబాద్–పూణే మధ్య నడిచే శతాబ్ది ఎక్స్ ప్రెస్ స్థానంలో వందేభారత్ సిట్టింగ్ రైలు రానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుతం కాచిగూడ–బెంగళూరు మధ్య నడిచే వందేభారత్ ఎక్స్ ప్రెస్ రైలుకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. దీంతో ఆ రైలుకు 8 బదులుగా 16 కోచ్ లకు పెంచాలన్న డిమాండ్ ను దక్షిణ మధ్య రైల్వే పరిశీలిస్తోంది. అటు తిరుపతి–నిజామాబాద్ మధ్య నడుస్తోన్న రాయలసీమ ఎక్స్ ప్రెస్.. ఇకపై బోధన్ వరకు వెళ్లనుంది. అంతేకాకుండా సికింద్రాబాద్–రాజ్ కోట్ మధ్య రాకపోకలు సాగిస్తోన్న రాజ్ కోట్ ఎక్స్ ప్రెస్ ను కచ్ జిల్లా వరకు పొడిగించాలని.. ఆ ప్రాంత వాసులు కోరగా దక్షిణ మధ్య రైల్వే జీఎం ఈ ప్రతిపాదనపై కూడా పరిశీలన జరుగుతోందని వివరించారు.

# కవితకు అస్వస్థత

## జైలు నుంచి దీన్ దయాళ్ ఆస్పత్రికి తరలింపు

న్యూ ఢిల్లీ , జూలై 16 : లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీహార్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. జైల్లో ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. జ్వరం, గైనిక్ సమస్యలతో బాధపడుతుండడంతో ఆమెను జైలు నుంచి దీన్ దయాళ్ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు. దీన్ దయాళ్ ఆసుపత్రిలో ఆమెకు చికిత్స చేస్కతున్నారు. తీహార్ జైల్లో కవిత 100 రోజులకు పైగా ఉంటున్నారు. కవిత అస్వస్థతకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రేషన్ కార్డు లేకున్నా ఆరోగ్య శ్రీ సేవలు

- అందరికీ వర్తింపజేయాలి
- విధి విధానాలు రూపొందించండి
- రాష్ట్రంలో ప్రతిఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):** తెలంగాణలో అవసరం ఉన్న అందరికీ ఆరోగ్య శ్రీసేవలు అందేలా చూడాలన్నారు సీఎం రేవంత్ రెడ్డి. కేవలం రేషన్ కార్డు ఉన్న వాళ్లకే ఆరోగ్యశ్రీ సేవలు అందించొద్దని అందరికీ సేవలు అందుబాటులో ఉంటారన్నారు. ఆరోగ్య శాఖ పై సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణలో రేషన్ కార్డు లేకపోయినా సరే ఆరోగ్యశ్రీ సేవలు అందాలని ఆ దిశగా విధి విధానాలు రూపొందించాలని సూచించారు రేవంత్ రెడ్డి. రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దన్నారు. తెలంగాణలో అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయాలని... ఆర్ఎంపీ, పీఎంపీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వాలని కూడా సూచించారు. దీనిపై అధ్యయనం చేసి కొత్త జీవో విడుదల చేయాలన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు సీఎం. రూరల్ ఏరియాలో పనిచేసే వైద్యులకు పారితోషకం ఎక్కువ అందించి ప్రోత్స హించేలా చర్యలు తీసుకోవాలని కూడా చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రతీ బెడ్‌కు ఒక సీరియల్ నెంబర్ ఉండే లా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ఆదేశించారు.

**అన్నింటికీ ఇదే సూత్రం వర్తింపజేయాలి: హరీశ్**

ఆరోగ్య శ్రీకి రేషన్ కార్డుతో పని లేకుండా చేసిన సీఎం మిగతా వాటికి కూడా ఇదే సూత్రం వర్తింప జేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ముఖ్యంగా రైతు రుణమాఫీకి కూడా రేషన్ కార్డు ఇతర పత్రాలు లేకుండానే ఇవ్వాలని సూచించారు. రేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలని అన్నారు.

# తప్పుల తడకగా డీఎస్సీ హాల్ టిక్కెట్లు

**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం) :** తెలంగాణ డీఎస్సీ నియామకాల్లో రోజుకో వివాదం తెరపైకి వచ్చింది. ఒకవైపు డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలంటూ నిరుద్యోగులు పోరు బాట పడుతుంటే.. సర్కార్ మొండిపట్టుదలతో పరీక్షలు నిర్వహించే తీరుతాం అంటూ తెగేసి చెప్పారు. అంతేనా.. హాల్ టికెట్లు కూడా విడుదల చేసింది. అయితే హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకున్న అభ్యర్థులు.. వాటిల్లోని వివరాలు చూసుకుని ఖంగు తింటున్నారు. ఒకే రోజు రెండు పరీక్షలు ఉంటే.. ఉదయం ఒక జిల్లాలో, మధ్యాహ్నం మరొక జిల్లాలో పరీక్ష కేంద్రం ఉండటం చూసి అభ్యర్థులు గుడ్లు తేలేశారు. దీనిపై గందరగోళం నెలకొనడంతో సర్కార్.. కొన్ని మార్పులు చేసి ఒకే రోజు రెండు పరీక్షలు ఉంటే.. ఒకే కేంద్రంలో రాయొచ్చు. అటువంటి వారికి మళ్లీ హాల్ టికెట్లను జారీ చేస్తామని హామీ ఇచ్చింది. హమ్మయ్యా.. అని అనుకునేలోపు తాజాగా మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఒక జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యోగం కోసం డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారికి, మరోక జిల్లాలో పోస్టుకు అప్లై చేసుకున్నట్లుగా హాల్ టికెట్ లో రావడంతో అభ్యర్థులు బెంబేలెత్తిపోతున్నారు. ఏం చేయాలో, ఎవరిని అడగాలో పాలు పోక ఆందోళన చెందుతున్నారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగుకు చెందిన శ్రీపెల్లి జ్యోత్స్న అనే అభ్యర్థి, మంచిర్యాల జిల్లాలో ఎస్జీటీ పోస్టుకు దరఖాస్తు చేసుకుని హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకుంది. అయితే అందులో నల్గొండ జిల్లాలో ఉపా ధ్యాయ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నట్లు ఉంది. ఇక పరీక్ష కేంద్రాన్ని ఆదిలాబాద్ జిల్లా మావలలో కేటాయించారు.మరో ఘటనలో కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కొర్కల్ కు చెందిన పొరెడ్డి సౌజన్య అదే జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. హాల్ టికెట్ లో ఖమ్మం జిల్లాలో పోస్టుకు అప్లై చేసుకున్నట్లుగా ఉంది. ఈ విషయంపై హెల్ప్ డెస్క్ కు ఫిర్యాదు చేశామని సౌజన్య తెలిపింది. దీనిపై స్పందించిన విద్యాశాఖ విచారణ జరిపి పొరపాటును సరిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. కాగా ఈ పరీక్షలకు దాదాపు 2,79,966 మంది అభ్యర్థులు రాయనున్నారు.


# విద్యుత్ కమిషన్ చైర్మన్‌ను మార్చండి

## ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 16 : కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్ల కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేసేందుకు నియమించిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్ కమిషన్ చైర్మన్ గా ఉంటూ ప్రెస్ మీట్ ఎలా పెడతారని..తన అభిప్రాయాల్ని ఎలా వెలిబుచ్చాతారని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తి న్యాయం చెప్పడమే కాకుండా.. నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. విద్యుత్ కమిషన్ చైర్మన్ గా మరొక జడ్జిని నియమించాలని సూచించారు. చీఫ్ జస్టిస్ సూచనకు తెలంగాణ ప్రభుత్వ లాయర్ అంగీకరించారు. మధ్యాహ్నం తర్వాత కొత్త విద్యుత్ కమిషన్ చైర్మన్ గా ఎవరిని నియమిస్తారో చెప్పాలన్నారు. విద్యుత్ కమిషన్ నియామకం, ఆ కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి ముందుగానే అభిప్రాయాలు చెప్పడం వంటి వాటిపై కేసీఆర్ మొదటి నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారం.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం తదితర అంశాలపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ యగా.. కేసీఆర్ కు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో కేసీఆర్ పాత్రపై కమిషన్ వివరణ కోరింది. తనను విచారణకు పిలవకూడదంటూ గులాబీ బాస్ తెలంగాణ హై కోర్టును ఆశ్రయించారు. కమిషన్ చైర్మన్ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ముందే నిర్ణయానికి వచ్చినట్లుగా ప్రెస్ మీట్లు పెడుతున్నారని కోర్టుదృష్టికి తీసుకెళ్లారు. అక్కడ అనుకూల ఫలితం రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ 1952, విద్యుత్తు చట్టం–2003కి అది విరుద్ధమని.. దాన్ని రద్దుచేయాలని కేసీఆర్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తు కొనుగోళ్లపై వివాదం ఉంటే.. తెలంగాణ, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండళ్లు తేల్చాలే తప్ప.. దానిపై విచారించే అధికారం కమిషన్ కు లేదని తన పిటిషన్ లో పేర్కొన్నారు. అయితే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ .. ప్రస్తుత విద్యుత్ కమిషన్ చైర్మన్ ప్రెస్ మీట్ పెట్టడంపైనే అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మార్చాలన్నారు. కేసీఆర్ వ్యక్తం చేసిన అభ్యంతరాల్లో అది కూడా ఒకటి. కొత్త న్యాయమూర్తి పేరును చెప్పిన తర్వాత విచారణ కొనసాగించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇస్తే.. అది కేసీఆర్ కు ఇబ్బందేనని భావిస్తున్నారు. సుప్రీంకోర్టు విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. ఇక కేసీఆర్ కు అన్ని దారులు మూసుకుపోయినట్లే అనుకోవచ్చు. కమిషన్ విచారణను ఆయన ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ అసలు కమిషనే చట్ట విరుద్ధం కాబట్టి విచారణ ఏం ఉండదని అనుకుంటున్నారు.

# అమెరికా ఎన్నికల్లో తెలుగు అడుగులు

- అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా జె.డి.వాన్స్
- ఆయన సతీమణి తెలుగు మూలాలున్న ఉషా చిలుకూరి
- అమెరికా, భారత్‌లో ఆమె గురించే చర్చ



**వాషింగ్టన్, జూలై 16:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అంచనాలన్నీ నిజమైతే ఓ తెలుగింటి అమ్మాయి.. ఆ దేశ రెండో మహిళగా నిలుస్తారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైన జె.డి.వాన్స్ భార్య, ఉషా చిలుకూరి వాన్స్ తెలుగు మూలాలున్న మహిళ. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్య ర్థి డొనాల్డ్ ట్రంప్, వాన్స్ పేరు ప్రకటించగానే.. ఆయ న భార్య ఉష గురించి కూడా ఎక్కువగా చర్చిస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇప్పుడు కొత్తగా వినిపిస్తున్న పేరు ఉషా చిలుకూరి వాన్స్. పేరు చూస్తే తెలుగు మూలాలున్నమహిళగా అర్థమవుతోంది. అమెరికా అధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న డోనాల్డ్ ట్రంప్ తన డిప్యూటీగా 39 ఏళ్ల జేడీ వాన్స్ పేరును సోమవారం అనౌన్స్ చేశారు. రిపబ్లికన్ పార్టీ తరుపున డోనాల్డ్ ట్రంప్ అధికారిక అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. మిల్వాకీలో జరిగిన పార్టీ కన్వెన్షన్ లో ఆయన వాన్స్ పేరును స్వయంగా అనౌన్స్ చేశారు. తనపై హత్యాయత్నం తర్వాత ట్రంప్ పాల్గొన్న మొదటి కార్యక్రమం ఇదే. వాన్స్ పేరును అనౌన్స్ చేసినప్పుడు ఉషా అక్కడే ఉన్నారు. డోనాల్డ్ ట్రంప్ జె.డి.వాన్స్ పేరు ప్రకటించిన తర్వాత ఆడిటోరియం అంతా మార్మోగిపోయింది. ఓహియోకు ప్రాతినిధ్యం వహిస్తున్న వాన్స్ పెద్దగా రాజకీయ అనుభవం ఉన్నవారు కాదు. తొలిసారి ఆయన సెనేటర్ అయ్యారు. పైగా ట్రంప్ అంతరంగిక బృందంలోని వాడు కూడా కాదు. కానీ వయసులో పెద్ద అయిన ట్రంప్ తన టీమ్ కు యంగ్ లుక్ ఇవ్వడం కోసం 39 ఏళ్ల వాన్ ను ఎంపిక చేశారు. అయితే వాన్స్ పేరు బయటకు వచ్చాక ఆయనతో పాటే ఆయన భార్య ఉషా చిలుకూరి వాన్స్ పేరు కూడా ఎక్కువ చర్చలోకి వచ్చింది. ప్రఖ్యాత పత్రికతో పాటు అన్ని చానెల్స్ వంటివన్నీ ఆమె గురించి చర్చించడం మొదలుపెట్టాయి. జెడి వాన్ రాజకీయ గమనానికి ఆమే ముఖ్య కారణం. అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థి ఇప్పుడు తెలుగింటి అల్లుడు. రిపబ్లికన్ పార్టీకి ఉన్న గెలుపు అవకాశాల దృష్ట్యా ఆయనే ఉపాధ్యక్షుడు అయ్యే అవకాశం ఉంది. అలా అయితే సెకండ్ లేడీగా నిలుస్తారు. ఇప్పుడు అమెరికాలోనే కాదు.. మన ఆంధ్రా, తెలంగాణలో కూడా ఇదే ఎక్కువగా నడుస్తోంది.

అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థి ప్రకటన తర్వాత ఆమె గురించి తెలుసుకునేందుకు గూగుల్ ను, తెగ వెతికేస్తున్నారు. ఉషా చిలుకూరి తెలుగు మూలాలున్న అమెరికన్. ఆమె తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ నుంచి కాలిఫోర్నియా వెళ్లి వెళ్లి స్థిరపడ్డారు. ఆ రాష్ట్రంలోని శాన్ డియాగోలోనే ఉష పుట్టి పెరిగారు. ప్రఖ్యాత యేలా యూనివర్శిటీ 2010–13 వరకూ చదివి న్యాయ శాస్త్ర పట్టా పుచ్చుకున్నారు. అక్కడే ఆమెకు జెడి వాన్స్ పరిచయం. 2014లో వారిద్దరి వివాహం జరిగింది. 2015లో ఉష... లా ఫర్మ్ లో అసోసియేట్ గా ఉద్యోగం ప్రారంభించారు. ఆ తర్వాత 2018లో కేంబ్రిడ్జ్ నుంచిఎంఫిల్ చేసిన ఆమె సుప్రీంకోర్టులో లా క్లర్క్ గా పనిచేశారు. అత్యున్నత న్యాయస్థానంలో ఇది ముఖ్యమైన పొజిషన్. ఉన్నత విద్య, టెక్నాలజీ, స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన వ్యాజ్యాల్లో ఆమెకి మంచి పేరు ఉంది. సుప్రీంకోర్టులో పనిచేసిన తర్వాత మళ్లీ బయటకు వచ్చి పాత కంపెనీలోనే ఉద్యోగం చేస్తూ వచ్చిన ఆమె... తన భర్త పేరు అనౌన్స్ చేసిన తర్వాత రాజీనామా చేశారు. భర్తతో వైవాహిక బంధం పంచుకోవడం మాత్రమే కాదు.. ఆయన్ను రాజకీయాల వైపు నడిపించడంలోనూ ఉషదే ముఖ్య పాత్ర. యేల్స్ లో ఉన్నప్పటి నుంచే అనేక సామాజిక అంశాలపై వీళ్లిద్దరూ పరిశోధనలు చేసేవారు. అతన్ని రాజకీయాల వైపు ఓ విధంగా ఆమెనే ప్రోత్సహించారు. ఈ విషయాన్ని జెడీ వాన్స్ పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. తన జీవిత అనుభవాలతో ఆయన అనే బుక్ కూడా రాశారు. ఇది ఆ తర్వాత మూవీగా కూడా వచ్చింది. 2016లో వాన్స్ మొదటి సారి సెనేటర్ గా పోటీ చేసినప్పుడు ఆమె తన భర్త వెంట పొలిటికల్ ర్యాలీల్లో తిరిగారు. ఉష హిందూ, వాన్స్ కాథలిక్ క్రిష్టియన్. ఆమె తెలుగు మూలాలున్న వ్యక్తి అని తెలుస్తున్నా పూర్తి వివరాలు ఎక్కడ అని తెలుసుకునేందుకు ఏబీపీ దేశం ప్రయత్నించింది. అమెరికాలోని ఎన్ఆర్ఐలు కూడా ఇప్పుడే ఆమె గురించి సమాచారం సేకరిస్తున్నారు. "యు.ఎస్ లో రెండు పూల్స్ ఉంటాయి. కొత్తగా అక్కడికి వెళ్లిన యువకులు.. ౩౦–40 ఏళ్ల క్రితం అక్కడకి వెళ్లిన ముందు తరాల వారు. కానీ ఉష కుటుంబం చాలా కాలం క్రితమే కాలిఫోర్నియా వెళ్లిపోయింది. ఆమె సుప్రీంకోర్టులో బెంచ్ క్లర్క్ గా చేశారు. లీగల్ డిపార్ట్ మెంట్ లో దేశం మొత్తం మీదు ఉన్న 5–6 పెద్ద పొజిషన్లలో అదొక్కటి. కాబట్టి ఆమె లీగ్ పూర్తిగా వేరు. మన తెలుగు వాళ్లు కూడా ఇప్పుడే తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలు రావొచ్చు" అని ఏపీ నాన్ రెసిడెంట్ ఫోరమ్ APNRT పూర్వ అధ్యక్షుడు రవి వేమూరి తెలిపారు. అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ వయసులో సగం ఉన్న జేడీ వాన్స్ ఇప్పుడు రిపబ్లికన్ పార్టీకి యువతరం ప్రతినిధి. అతను అమెరికాలోని దిగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన శ్వేతజాతి యువకుడు. ఉష.. ఆయన ప్రతి అడుగులోనూ వెన్నంటి నిలిచిన అదృశ్య శక్తి. అందుకే అమెరికన్ మీడియా ఆమె గురించి ఎక్కువగా చర్చిస్తున్నాయి.

# షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

## రేషన్ కార్డు ప్రమాణికం చేయడం సమంజసం కాదు

## రేవంత్ సర్కారుపై విపక్షాల మండిపాటు

## రైతులు ఉద్యమిస్తారని హెచ్చరిక

**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం) :** తెలంగాణలో రుణమాఫీపై రాజకీయ రణరంగం సృష్టిస్తోంది. రుణమాఫీకి రేషన్ కార్డును ప్రాతిపదిక చేసుకోవడంపై విపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నమ్మకద్రోహంగా ఆరోపిస్తున్నాయి. బేషరతుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకునేందుకే గవర్నమెంట్ ప్రయత్నిస్తుంది తప్ప ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన లేదని మండిపడుతున్నాయి. రైతులందరికీ మాఫీ చేయాల్సిన ప్రభుత్వం వడపోతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. 2018 డిసెంబర్12 కంటే ముందు ఉన్న వారి రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. రైతులకు రుణభారం తగ్గిస్తుందని అనుకుంటే... ప్రభుత్వం తన భారాన్ని దించుకునే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో స్పష్టమైన హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాయమాటలతో మభ్యపెడుతోందన్నారు మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి. రేషన్ కార్డు లేని వాళ్లు, పింక్ కార్డు ఉన్న వారి పరిస్థితి ఏంటని నిలదీశారు.

ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేసింది బీజేపీ. ఆ పార్టీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... అందరికీ రుణమాఫీ ఇవ్వలేక ప్రభుత్వం కొత్త కథలు చెబుతోందని మండిపడ్డారు. ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని ప్రభుత్వం ఇప్పుడు అదే రేషన్ కార్డును ప్రామాణికంగా ఎలా తీసుకుంటుందని నిలదీశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుందని రాజకీయ, ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పీఎం కిసాన్ డేటాకు జోడిస్తే చాలా మంది నష్టపోతారని చెబుతున్నారు. రేషన్ కార్డుతో ముడిపెట్టడమే కాకుండా స్వల్ప కాలిక పంట రుణాలకే మాఫీ వర్తిస్తుందని చెప్పడం కూడా ప్రభుత్వానికి ఎదురు దెబ్బే అంటున్నారు. ఇప్పటికే నిరుద్యోగ యువత నిరసనలు చేస్తున్నారని ఇప్పుడు రైతులు కూడా రోడ్లపైకి వచ్చే అవకాశం ఉందంటున్నారు.



## మొక్కలు నాటిన సినీ నటుడు సుమన్



**గజ్వేల్, జులై 16 (ప్రజాస్వరం) :** సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని సద్గురు శ్రీమధు సూధన సాయి స్థాపించిన శ్రీ సత్యసాయి ప్రశాంతినికేతన్ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం కార్యక్రమానికి సినీ నటుడు సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటిన అనంతరం సుమన్ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో సేవతత్వం కలిగి ఉండాలన్నారు. సత్యసాయి ప్రశాంతి నికేతన్ మహిళా కళాశాలకు దాతలు ముందుకు వచ్చి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. విద్యార్థినిలు విద్యతో పాటు మనోత్సైర్యం కలిగి ఉండాలని దానికి మార్షల్ ఆర్ట్స్ లో ప్రావీణ్యం పొందాలని సూచించారు. కుల మతాలకు అతీతంగా సేవా మార్గంలో ముందుండాలని అన్నారు. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం చక్కని ఆహ్లాద కరమైన వాతావరణంలో ఉన్నదని, ఈ కళాశాల సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్ పర్సన్ పూర్ణిమ శంకర్, సెక్రటరీ శంకర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## 21న నల్లపోచమ్మ బోనాలు

**మెదక్, జులై 16 (ప్రజాస్వరం) :** ఆషాడ మాసం పురస్కరించుకొని మెదక్ పట్టణం తారక రామానగర్ కాలనీలోని నల్ల పోచమ్మ బోనాల వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 21న నల్ల పోచమ్మ బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు మాజీ కౌన్సిలర్లు తిమ్మన్నగారి అనిల్ కుమార్, శ్రీధర్ యాదవ్ తెలిపారు. మంగళవారం పట్టణం తారకరామానగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈనెల 21 ఆదివారం ఉదయం అమ్మవారికి జెండా సమర్పణ, నాగ దేవత, ఎల్లమ్మకు నైవేద్యం, పట్టు వస్త్రాల సమర్పణ, సాయంత్రం నల్ల పోచమ్మ సామూహిక బోనాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బోనాల వేడుకకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దంపతులు హాజరుకానున్నట్లు తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగాలని వారు కోరారు.



## ప్రభాకర్‌ను సన్మానించిన ఆర్యవైశ్యులు

**గజ్వేల్, జులై 16 (ప్రజాస్వరం):** గజ్వేల్ పట్టణ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్ అమెరికా వెళ్తున్న సందర్భంగా మంగళవారం శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. నాచారం దేవస్థానం మాజీ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ.. కైలాస ప్రభాకర్ సమాజ సేవలో ముందు వరుసలో ఉంటూ వివిధ సందర్భాల్లో అన్నదానం చేస్తూ ఆర్యవైశ్యులు నిర్వహించే ప్రతి సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారన్నారు. గజ్వేల్‌లో నిర్మిస్తున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నిర్మాణ కమిటీలో క్రియాశీల పాత్ర పోషిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న కైలాస ప్రభాకర్ అమెరికా వెళ్తున్న సందర్భంగా చిరు సన్మానం చేశామని అన్నారు. కార్యక్రమంలో కొండపోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు కొమరవెల్లి సుధాకర్, చంద్రశేఖర్, దొంతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# న్యాయం చేయండి

- ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి
- మృతదేహంతో పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన
- ఎస్సైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- నిందితులకే కొమ్ము కాస్తున్నారని ఆరోపణ
- వెల్దుర్తి మండల కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తత

**వెల్దుర్తి, జూలై 16 ( ప్రజాస్వరం) :** మండల కేంద్రంలో గురువారం ధర్మారం గ్రామానికి చెందిన ఓ మహిళను వెల్దుర్తి గ్రామానికి చెందిన ఓ యువకుడు తన ద్విచక్ర వాహనంతో ఢీకొట్టగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి మంగళవారం చెందింది. ఈ సంఘటన తీవ్ర ఉద్రిక్తత దారి తీసింది. ధర్మారం గ్రామానికి చెందిన బర్ల లక్ష్మి (52) తన గ్రామం నుండి గురువారం పని నిమిత్తం వెల్దుర్తికి వచ్చింది. స్థానిక బాలాజీ హాస్పిటల్ వద్ద ఆటో దిగితుండగా వెల్దుర్తి గ్రామానికి చెందిన సల్మాన్ ఖాన్ ద్విచక్ర వాహనంతో లక్ష్మిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ లక్ష్మిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో మృతురాలి బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై నవత గౌడ్ కనీసం స్పందించలేదని ఆరోపించారు. కనీసం ఢీకొట్టిన ద్విచక్ర వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తెప్పించకపోగా యువకుడి కుటుంబ సభ్యులను పిలిపించి కూడా ఎలాంటి సమాచారం సేకరించలేదని ధర్మారం గ్రామస్తులు వెల్దుర్తి ఎస్ఐ తీరును తప్పుపట్టారు. నేరుగా మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి నుండి పోలీస్ స్టేషన్ వద్దకు తరలించి ఆందోళనకు దిగారు. మొదటగా మృతదేహాన్ని వాహనం ఢీ కొట్టిన యువకుని ఇంటి ముందు తీసుకువెళ్లి ఆందోళన చేద్దామన్న తరుణంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పోలీస్ స్టేషన్ ముందుకు తరలించారు. దీంతో పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తులు మృతురాలి బంధువులు యువకులు పెద్ద ఎత్తున ఎస్సై వైఖరిని తప్పు పట్టుతూ ఎస్సై డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో తూప్రాన్, శివంపేట ఎస్సైలు మహిపాల్ రెడ్డి, నవత గౌడ్ తమ సిబ్బందితో పోలీస్ స్టేషన్ ఆవరణానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. మృతురాలి కోడలు జ్యోతి కూతుర్లు అనురాధ యశోదలు మాట్లాడుతూ వెల్దుర్తి ఎస్ఐ పనితీరు బాగాలేదని మండిపడ్డారు. వాహనం ఢీ కొట్టిన వ్యక్తులకే వెల్దుర్తి ఎస్ఐ కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయం జరిగే వరకూ తాము పోలీస్ స్టేషన్ ఎదుటే మృతదేహంతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మృతురాలి కొడుకు శేఖర్ ప్రమాదంలో చనిపోగా పెద్ద కూతురు భర్త కూడా మృతి చెందారు. దీంతో చిన్న బిన్నమైన కుటుంబంలో తమఇంటి పెద్ద దిక్కును కోల్పోయామని కుటుంబ సభ్యుల బంధువుల రోదనలు పోలీస్ స్టేషన్ ఆవరణలో పలువురిని కంటతడి పెట్టించాయి. చివరికి పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



## ముస్లింలకు మొహర్రం శుభాకాంక్షలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్, జులై 16 (ప్రజాస్వరం) :** ముస్లింలకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మొహర్రం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మొహర్రం పండుగ త్యాగానికి, స్ఫూర్తికి ప్రతీక అని, విశ్వాసం, నమ్మకం కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానాన్నిగుర్తు చేసుకోవటమే మొహరం పండుగ ప్రత్యేకతని అన్నారు. మానవజాతి త్యాగం ఎంతో గొప్పదని మంచితనం, త్యాగాన్ని గుర్తు చేసుకోవటమే ఈ పండుగ యొక్క ప్రత్యేకతని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**పటాన్ చెరు, జులై 16 (ప్రజాస్వరం) :** పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో పటాన్ చేరు నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా.. ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెల్లాపూర్ మున్సిపల్ అధ్యక్షులు చిలకమర్రి ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు డోకూరి రామ్మోహన్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు బాబు, అతీక్ తదితరులు ఎమ్మెల్యే జీఎంఆర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమిష్టి కృషితో ఇటు పార్టీని అటు పటాన్ చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్దామని ఎమ్మెల్యే జీఎంఆర్ సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నగేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## నీలం మధుకు ఆహ్వానం

**పటాన్ చెరు, జూలై 16, (ప్రజాస్వరం) :** తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమతులైన జ్ఞానేశ్వర్ ముదిరాజ్ రేపు 17వ తేదీన జరిగే తన ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా నీలం మధు ముదిరాజ్ ను ఆహ్వానించారు. చిట్కుల్ లోని నీలం మధు కార్యాలయంలో ఆయనను కలిసి ఆహ్వానించారు. ఈ సంధర్బంగా ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు లో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ గా ముదిరాజ్ వర్గాల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్బంగా శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా వన మహోత్సవం

**కొల్చారం, జులై 16 (ప్రజాస్వరం):** పోతిరెడ్డిపల్లి, కొంగోడు , నాయిని, జలాల్పూర్ గ్రామాల్లో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమములో ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు, ఏపీఓ మైపాల్ రెడ్డి మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయత్ కార్యదర్శులు మౌనిక, సౌజన్య , ఫీల్డ్ అసిస్టెంట్ లు సత్యనారాయణ, యాదుల్ గ్రామస్థులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి శుభాకాంక్షలు : గాజుల శ్రీనివాస్



**గజ్వేల్, జూలై 16 (ప్రజాస్వరం) :** గజ్వేల్ పట్టణ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గజ్వేల్ మాజీ వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాజుల శ్రీనివాస్ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా జరుపుకునే పండుగ తొలి ఏకాదశి అని తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో అందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.



## అమ్మ మాట అంగన్వాడీ బాట

**అల్వాల్, జూలై 16 (ప్రజాస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం అల్వాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సర్కిల్ పరిధిలోని పలు అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో టీచర్లు స్వయం సహాయక బృందాలు, యువత, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. రెండున్నర ఏళ్లు దాటిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లోని ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని వారికి ఆటపాటలతో కూడిన విద్యను అందించి పాఠశాలలలో చేరినాటికి అక్షరాలు అంకెలు ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తామని అంగన్వాడీ టీచర్లు తెలిపారు. స్వరూప, పద్మ, శిల్ప, అన్నపూర్ణ, వెంకటేష్, జయమ్మ, రాజమ్మ పాల్గొన్నారు.

# అసౌకర్యం కలిగించొద్దు

- మొహర్రం వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా చూడాలి
- ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దు
- ఆయుధాల ప్రదర్శన, రెచ్చగొట్టే కార్యకలాపాలు నిషేధం
- సోషల్ మీడియాలో విద్వేషకర, తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి




**మెదక్, జులై 16 (ప్రజాస్వరం):** సోషల్ మీడియాలో విద్వేషకర, తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. మొహర్రం సందర్భంగా జిల్లా పోలీసులు ఇప్పటికే నిర్వాహకులు, కమిటీలతో శాంతి, మతసామరస్యం కోసం సమావేశాలను నిర్వహించామని అన్నారు. మొహర్రం నిర్వాహకులు, కమిటీలు కచ్చితంగా పోలీస్ వారి సూచనలను ఆదేశాలను పాటించాలని తెలిపారు. మొహర్రం ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. వేడుకలు ప్రశాంత వాతారణంలో ముగిసేందుకు సిబ్బంది కృషి చేయాలని ఇందుకు మొహర్రం నిర్వాహకులు, కమిటీ సభ్యులు కూడా సహకరించాలని అన్నారు. సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ ఎవరికీ కేటాయించిన స్థానాలలో వారే విధులను నిర్వర్తించాలని, ఉన్నతాధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. బందోబస్తు సమయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సెక్టార్ వైజ్‌గా తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధులను నిర్వర్తించాలన్నారు. పీర్ల ఊరేగింపు సమయంలో సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రతి ఒక్కరిపై దృష్టి సారించాలన్నారు. అలాగే ముందుగా నిర్ణయించిన సమయ షెడ్యూల్‌ను ప్రకారం మొహర్రం ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఊరేగింపు ముందుగా నిర్ణయించిన రోడ్ మ్యాప్‌కు ఖచ్చితంగా కట్టుబడి ఉండాలని ఆయుధాల ప్రదర్శన, రెచ్చగొట్టే సంజ్ఞలు కార్యకలాపాలు ఖచ్చితంగా నిషేధిమన్నారు. ఎవరైనా ఆయుధాల ప్రదర్శన, రెచ్చగొట్టే సంజ్ఞలు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని సోషల్ మీడియాలో విద్వేషకర, రెచ్చగొట్టే, తప్పుడు పోస్టులు పెట్టవద్దని అలా కాదని ఎవరైనా తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిని జిల్లా పోలీసులు నిరంతరం గమనిస్తారని అన్నారు. అలాంటి వారిపై చట్ట ప్రకారం కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సామాజిక మాధ్యమాలు అయిన వాట్సప్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రాం, టెలిగ్రామ్, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకోని తప్పుడు, విద్వేషకర పోస్టులు చేసిన, షేర్ చేసినా వారి సమాచారాన్ని పోలీస్ వారి ఐ.టి సెల్ నెం. 8712657960 తెలియజేయాలని అట్టి సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. అన్నింటికంటే మించి ఊరేగింపును బయటకు తీసుకురావడానికి పోలీసుల నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎస్పీ సూచించారు.

విలేకరులు కావలెను

ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా
జర్నలిజం రంగంలో
విశిష్ట సేవలందిస్తూ
అత్యంత ప్రజాదరణ
పొందిన ప్రజాస్వరం
తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు,
మండల రిపోర్టర్లు కావలెను.



సెల్ : 800 860 9999




## అల్వాల్ కేసులో ఇద్దరు అరెస్ట్

మేడ్చల్, జూలై 16 (ప్రజాస్వరం) : మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నాలుగు రోజుల క్రితం ఓ మహిళ కుటుంబ సమస్యల కారణంగా అల్వాల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు వచ్చి తిరిగి వెళ్తుండగా అత్యాచారానికి గురైందని ఫిర్యాదు అందిందన్నారు. ఈ కేసులో అల్వాల్ పోలీసులు, ఎస్ఓటీ, సీసీస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి నిందితులను పట్టుకున్నట్లు వివరించారు. అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని ఇద్దరు నిందితుల్లో ప్రధాన నిందితుడు సాయికిరణ్ గా, అతనికి సహకరించిన మహ్మద్ సలీంలను పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. నిండితులిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహిళ ప్రయాణం చేసిన ఆటో డ్రైవర్ శంకర్ ను కూడా ఇంకా విచారించాల్సి ఉందన్నారు.



## ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

**ప్రోటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఫిర్యాదు**

రంగారెడ్డి, జూలై 16 (ప్రజాస్వరం) : కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని, పలు నియోజకవర్గాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు సమర్పించారు. బీఆర్ఎస్ బీ ఫాంపై గెలుపొంది పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. అదే విధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన నియోజకవర్గాల్లో అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వారికి ప్రాధాన్యత ఇస్తూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వీటిన్నింటిపై దృష్టి సారించి, పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజశేఖర్ రెడ్డి, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానంద గౌడ్ ఉన్నారు.



# అభివృద్ధే ధ్యేయం

- రైతు కుటుంబాల్లో సంతోషం చూడాలన్నదే ప్రభుత్వ తాపత్రయం
- అందుకే ప్రతి రైతు కుటుంబానికి రూ.రెండు లక్షల రుణమాఫీకి శ్రీకారం
- సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో వికారాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా..
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- మర్పల్లిలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ..


వికారాబాద్, జూలై 16 (ప్రజాస్వరం) : ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి రూ.రెండు లక్షలలోపు రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. రైతుల కుటుంబాల్లో సంతోషం చూసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులు, మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా మర్పల్లి, బంటారం మండల కేంద్రాల్లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ... అర్హత గల ప్రతి రైతు కుటుంబానికి రూ. రెండు లక్షల రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. వచ్చే పంద్రా ఆగస్టు నాటికి నాటికి రైతులందరికీ రుణమాఫీ లక్ష్యం నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. రైతులు రుణమాఫీ ద్వారా ప్రయోజనం పొంది పంట పెట్టుబడులకు ఇబ్బందులు లేకుండా నాణ్యమైన పంటలు సాగు చేసేందుకు చొరవ చూపాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో వికారాబాద్ జిల్లాలో వచ్చే ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వివరించారు. ఒక్క వికారాబాద్ నియోజకవర్గానికి రూ. 4 నుంచి 5 వేల కోట్లు తీసుకువచ్చి రోడ్లు ఇతర ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలపై ప్రత్యేక దృష్టి పనిచేస్తుందని అన్నారు. త్వరలోనే షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాలకు తులం బంగారం అదనంగా ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. అలాగే మహిళలకు నెలసరి రెండున్నర వేల రూపాయల చొప్పున అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రతిపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను

ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.



సెల్ : 800 860 9999

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వండి



- పోలీసులకు డీజీపీ జితేందర్ ఆదేశం

రంగారెడ్డి, జూలై 16 (ప్రజాస్వరం) : ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు కమిషనర్లు, జిల్లాల ఎస్పీలకు డీజీపీ జితేందర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో పాల్గొనేందుకు పోలీసు అధికారులు హైదరాబాద్‌కు వచ్చారు. డీజీపీ కార్యాలయంలో మంగళవారం జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో డీజీపీ జితేందర్ మాట్లాడుతూ ఆయా జిల్లాలు, కమిషనరేట్‌లకు పంపిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు, ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం వల్ల ప్రజలు సంతృప్తి చెందుతారని చెప్పారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మహేశ్ ఎం భగవత్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కే శ్రీనివాస్ రెడ్డి, అదనపు డీజీపీలు శిఖా గోయెల్, అభిలాష బిష్త్, వీవీ శ్రీనివాస్ రావు, విజయ్ కుమార్, స్టీఫెన్ రవీంద్ర, పోలీస్ కమిషనర్లు అవినాష్ మహంతి (సైబరాబాద్), జి. సుధీర్ బాబు (రాచకొండ), ఐజీపీలు ఎస్. చంద్రశేఖర్ రెడ్డి (మల్టీ జోన్-1), వి. సత్యనారాయణ (మల్టీ జోన్ -II), ఎం రమేష్, కె. రమేష్ నాయుడు, నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇతర పోలీసు కమిషనర్‌లు, జిల్లా ఎస్పీలు సహా కీలక అధికారులు పాల్గొన్నారు.



## మౌలాలిలో రైలు ఢీ కొని రైల్వే ట్రాక్ మెన్ మృతి

రంగారెడ్డి, జూలై 16 (ప్రజాస్వరం) : విధులు ముంగించుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఓ రైల్వే ట్రాక్ మెన్ పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బీబీనగర్ గుడూరు ప్రాంతానికి చెందిన మహేందర్‌రెడ్డి (36) ఎస్ఎస్ఈ / పిడబ్ల్యూవై / ఎస్‌సి మౌలాలిలో ట్రాక్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం కూడా విధులకు హజరై విధులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో మౌలాలిలోని గూ డ్స్ క్యాబిన్ వద్ద స్టోర్ రూంకు వెళ్లి తిరిగి డౌన్ లైన్ పట్టాల పక్కన ఉన్న కంకరపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రైలు రాకను గమనించని రైల్వే ట్రాక్ మెన్ మహేందర్ రెడ్డిని రైలు ఢీ కొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి రైల్వే కార్మికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు



- పలు జిల్లాలకు ఆరెంజ్ ఎలర్ట్ ..

## తెలంగాణకు భారీ వర్ష సూచన

రంగారెడ్డి, జూలై 16 (ప్రజాస్వరం) : తెలంగాణలో రాగల ఐదురోజుల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవ కాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నిన్న దక్షిణ ఒడిశా పరిసరాల్లో ఉన్న అల్పపీడనం ప్రస్తుతం దక్షిణ ఛత్తీస్‌గఢ్‌ను ఆనుకొని విదర్భను ఆనుకొని ఉందని.. అనుబంధంగా ఉపరితల ఆవర్తం సగటున సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో నైరుతి దిశగా వంగి ఉందని పేర్కొంది. అల్పపీడనం ఈ నెల 19న పశ్చిమ మధ్య ప్రాంతాలను ఆనుకొని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. మంగళవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం నుంచి గురువారం వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇక గురువారం నుంచి శుక్రవారం వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మరికొన్ని జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణ వ్యాప్తంగా పలు చోట్ల అతి భారీ వర్షాలు నమోదయ్యాయి. అత్యధికంగా నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు పలుచోట్ల భారీ వర్షాపాతం రికార్డయ్యింది. నిజామాబాద్ జిల్లా సలూరలో 126 మిల్లీమీటర్లు, నవీపేటలో 116, కరీంనగర్ జిల్లా గంగాధరలో 117 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

## ఆ 10 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




రంగారెడ్డి, జూలై 16 (ప్రజాస్వరం): సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం పార్టీ ఫిరాయింపుల అంశంలో మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఉంది. ఇదే విషయాన్ని స్పీకర్ గారికి గుర్తు చేశాం అని ఆయన తెలిపారు. అసెంబ్లీలో స్పీకర్‌ను కలిసిన అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేరిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీ లు, ఒక రాజ్యసభ సభ్యుడు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను కూడా స్పీకర్‌కు అందించాం. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారి విషయంలో మూడు నెలల్లోనే చర్యలు తీసుకోవాలని 2020, జనవరిలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును స్పీకర్‌కు అందించాం. ఆ తీర్పును అనుసరించి మణిపూర్‌లో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్యామ్ కుమార్‌పై అక్కడి స్పీకర్ అతని శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేశారు. తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల కు పాల్పడిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మె ల్యేల విషయంలో ఇదే పద్ధతిని అనుసరించాలని సూచించాం. లేదంటే స్పీకర్ పదవికి అగౌరవం వచ్చే పరిస్థితి ఉందని చెప్పామని కేటీఆర్ తెలిపారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను కూడా చదివి స్పీకర్‌కు వినిపించాం. సుప్రీంకోర్టు చాలా స్పష్టంగా చెప్పింది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఐదేండ్ల కాలపరిమితిలో ఉండే ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే.. మూడు నెలల్లోపే నిర్ణయం తీసుకోవాలి. లేదంటే మణిపూర్ లో ఏ విధంగా అయితే సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశం ఇచ్చింది. ఇక్కడ కూడా ఆ పరిస్థితి వస్తుందన్నారు. మార్చి 18న దానం నాగేందర్ పిటిషన్ ఇచ్చాం. ఇవాళ 9 మంది పిటిషన్లు స్పీకర్ చేతికి అందించాం. 10 మంది ఎమ్మెల్యేలపై వెంటనే నిర్ణయం తీసుకోండి అని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశాం. సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చే పరిస్థితిని తీసుకు రావొద్దని చెప్పాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## పేదల భూముల జోలికి వస్తే సహించం

- అప్పయిపల్లి భూముల భూసేకరణను అడ్డుకుంటాం
- కొడంగల్ అభివృద్ధి పేరుతో పేదల భూములు తీసుకోవడం సబబు కాదు
- తాండూరు ఆర్డీవోకు వినతి పత్రం అందించిన రైతు సంఘాల ప్రతినిధులు



వికారాబాద్, జూలై 16 (ప్రజాస్వరం): వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలో ఉన్న 702 ప్రభుత్వ సీలింగ్ భూములను మెడికల్ కళాశాల కోసం సేకరించాలని ఆర్డీవో కార్యాలయంలో 19 సర్వే నంబర్ రైతులు, వివిధ ప్రజాసంఘాలు మంగళవారం తాండూర్ ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చారు. కొడంగల్ అభివృద్ధి పేరుతో పేదల భూములు తీసుకోవడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొడంగల్ లో ఉన్న 702 ఎకరాల సీలింగ్ భూములు తీసుకొని అభివృద్ధి చెయ్యాలని, ఆ అభివృద్ధి కి ప్రజా సంఘాలు సహకరిస్తాయన్నారు. తాము కొడంగల్ అభివృద్ధికి వ్యతిరేకం కాదు కానీ నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూముల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. 3 నెలల నుండి కొడంగల్ మండలం అప్పయిపల్లి గ్రామంలో 19 సర్వే నంబర్ సాగు చేసుకుంటున్న పేదల భూములను మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం తీసుకుంటామని అధికారులు వచ్చి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ పేదల భూములను గుంజుకోవడం సరైనది కాదన్నారు. సీలింగ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆ భూమిలో మెడికల్, పారా మెడికల్ కళాశాలలు, ఆసుపత్రులు ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం వల్ల మాకు సంతోషమే కాని సిఎం స్పందించి అన్యాక్రాంతమైన సీలింగ్ భూములను స్వాధీనం చేసుకుంటే అభివృద్ధి చేస్తాడని మేము కూడా నమ్ముతామని అన్నారు. భూ సేకరణ పునరావాస చట్టం 2013లో సెక్షన్ 11(1) ప్రకారం భూ సేకరణ ప్రాథమిక ప్రకటన ప్రకటించి సంబంధిత వ్యక్తులందరి నుండి అభ్యంతరాలు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో మా ఉద్యమాన్ని జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విస్తరింపజేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కొత్తూరు చంద్రయ్య, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎరన్ పల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, కళాకారుల సంఘం కొత్తూరు బాలు, 19 సర్వే నంబర్ భూబాధితులు శ్రీనివాస్, పకీరప్ప, అగ్గనూరు మల్లేష్, దుబ్బ బుగ్గప్ప, అమృతప్ప, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీకి పూర్వ వైభవం..?

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):

తెలంగాణలో బలపడేందుకు తెలుగుదేశం పార్టీ పక్కా వ్యూహంతో ముందుకు పోతోందా%@%? గతంలో పార్టీని వీడిన సీనియర్లను మళ్లీ సొంతగూటికి రావాలని ఆహ్వానిస్తుందా? ఇప్పటికే మాజీ మంత్రి మల్లారెడ్డితో టచ్‌లో ఉన్న టీడీపీ అధిష్టానం.. మరో సీనియర్ నేతతోనూ టచ్‌లోకి వెళ్లిందా? టీడీపీ అధిష్టానమే చొరవ చూపుతోందా? లేక మాజీ నేతలే తెలంగాణలో టీడీపీ ద్వారా పూర్వ వైభవం కోసం ప్లాన్ చేస్తున్నారా?ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన తర్వాత తెలంగాణలో తెలుగుదేశం బలోపేతానికి అడుగులు పడుతున్నాయి. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తేవాలని చంద్రబాబు కసరత్తు చేస్తున్న సమయంలోనే.. పలువురు నేతలు టీడీపీలోకి వస్తామంటూ వర్తమానం పంపుతుండటం చర్చనీయాంశమవుతోంది. ముఖ్యంగా ఒకరిద్దరు బీఆర్ఎస్ సీనియర్ నేతలు తెలుగుదేశంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మాజీ మంత్రి మల్లారెడ్డి టీడీపీలోకి వెళతారనే ఊహాగానాలు వినిపిస్తుండగా, ఇప్పుడు మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు కూడా టీడీపీలో చేరేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు చెబుతున్నారు.ఖమ్మం జిల్లాకు చెందిన నామా నాగేశ్వరరావు గతంలో టీడీపీ నుంచే బీఆర్ఎస్‌లోకి వచ్చారు. ఇప్పుడు రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం ఏపీలో చంద్రబాబు సర్కార్ తిరుగులేని విజయం సాధించడంతో మళ్లీ సొంతగూటికి వెళ్లాలని నామా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.పారిశ్రామిక వేత్తగా రాజకీయాల్లో సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకున్న నామా నాగేశ్వరరావుకు ఖమ్మం జిల్లాలో గట్టి పట్టుంది. టీడీపీకి కూడా ఆ జిల్లాలో క్యాడర్ ఎక్కువగా ఉండటం, ఖమ్మంలో బీఆర్ఎస్ పెద్దగా బలం లేకపోవడంతో నామా మళ్లీ టీడీపీలో చేరాలని అనుచరులు ఒత్తిడి చేస్తున్నారని అంటున్నారు.అటు సీఎం చంద్రబాబుతోనూ నామా నాగేశ్వరరావుకు సత్సంబంధాలు ఉండటం కూడా కలిసివస్తుందంటున్నారు. ఆర్థిక బలం ఉన్న నామా, మల్లారెడ్డి వంటివారు పార్టీలోకి తిరిగి వస్తే రాష్ట్రంలో



నిలదొక్కుకోవచ్చని టీడీపీ కూడా ఆశిస్తోందని చెబుతున్నారు. మరోవైపు గత నెలలో హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో నామా నాగేశ్వరరావు పాల్గొనడం ఈ ప్రచారానికి ఊతమిస్తోంది.

టీడీపీలో ఉండగా చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలిగిన నామా.. రాష్ట్ర విభజన తర్వాత గత్యంతరం లేని పరిస్థితుల్లోనే బీఆర్ఎస్‌లోకి వెళ్లాల్సివచ్చిందని ఆయన అనుచరులు చెబుతున్నారు. టీడీపీని వీడిన ఏనాడు చంద్రబాబును గాని, టీడీపీని గాని నామా విమర్శించలేదని ఖమ్మంలో టీడీపీ క్యాడర్‌ను సైతం విస్మరించలేదని గుర్తు చేస్తున్నారు నామా అనుచరులు. స్వతహాగా వ్యాపార వేత్త అయిన నామా బీఆర్ఎస్‌లో ఉండగా, టీడీపీ క్యాడర్‌కు సహకరించేవారు. దీంతో ఆయన రాకను ఖమ్మం టీడీపీ కూడా స్వాగతిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.మరోవైపు నామాను కాంగ్రెస్‌లో చేరాల్సిందిగా ఆ పార్టీ కూడా ఆహ్వానిస్తోంది. ఐతే ఇప్పటికే ఖమ్మం జిల్లాలో చాలా మంది సీనియర్ నేతలు ఉండటం వల్ల తాను ఆ పార్టీలో చేరినా పెద్దగా గుర్తింపు ఉండదని భావిస్తున్నారట నామా నాగేశ్వరరావు. టీడీపీలో చేరి ఏపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడం ద్వారా వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో కీలకంగా వ్యవహరించొచ్చని ఆశిస్తున్నారట నామా నాగేశ్వరరావు. మొత్తానికి మల్లారెడ్డి తర్వాత నామా నాగేశ్వరరావు కూడా టీడీపీ వైపు చూస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం తెలంగాణలో హాట్‌టాపిక్‌గా మారింది.

# హైదరాబాద్ లోనూ టీ స్క్వేర్...

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):

తెలంగాణ రాజధాని, విశ్వనగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ అంటే అందరికీ గుర్తుకు వచ్చేది చార్మినార్, గోల్కొండ కోట, హైటెక్‌సిటీ.. తదితర కట్టడాలు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ పలు ఐకానిక్ కట్టడాలు నిర్మించింది. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కొత్త సెక్రటేరియట్ భవనం, అమరవీరుల స్థూపం, భారీ అంబేద్కర్ విగ్రహం, దుర్గం చెరువుపైన కేబుల్ బ్రిడ్జ్, పోలీసుల కమాండ్ కంట్రోల్ టవర్, టీ%-%హబ్ ఇలా పలు ల్యాండ్ మార్క్ కట్టడాలను నిర్మించి.. హైదరాబాద్‌కు కొత్త అందాలు తెచ్చింది.తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా తమ మార్కు ఉండాలని భావిస్తోంది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా, తమ పాలనకు గుర్తుగా మిగిలేలా మరో ఐకానిక్ కట్టడం నిర్మించాలని యోచిస్తోంది. అగ్రరాజ్యం అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న టైమ్స్ స్క్వేర్ తరహాలో.. హైదరాబాద్‌లో 'టీ%-%స్క్వేర్' నిర్మించాలని నిర్ణయించింది. 'టీ%-% స్క్వేర్' నిర్మించి హైదరాబాద్ సిగలో మరో ఐకానిక్ ల్యాండ్ మార్క్‌ను చేర్చాలని రేవంత్‌రెడ్డి సర్కార్ భావిస్తోంది.కాంగ్రెస్ సర్కార్ నిర్మించ తలపెట్టిన టీ%-%స్క్వేర్ నిర్మాణం కోసం ప్రభ్వుం టెండర్లు కూడా పిలిచింది. ఆకాశాన్నంటే బిల్డింగులు, అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ల్యాండ్ మార్క్‌గా ఉన్న రాయదుర్గం, బయోడైవర్సిటీ ప్రాంతాల్లో టీ %-% స్క్వేర్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ టెండర్లు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాయద్గుం ప్రాంతంలో.. ఈ టీ%-%స్క్వేర్ నిర్మించటం వల్ల ఆ ప్రాతానికి మరింత ఆకర్షణ తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నారు. ఈ ప్రాంతానికి టీజీఎస్ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో రైల్ సర్వీస్‌లు నడుస్తున్నాయి. మరింత ప్రజాదరణ పొందాల్సి అవసరం ఉన్న నేపథ్యంలో రాయదుర్గంలో వినోద కేంద్రాలు, కొలాబరేషన్ జోన్స్, వాణిజ్య కూడళ్లతో కూడిన ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారాలని ప్రభుత్వం భావిస్తోంది.న్యూయార్క్‌లో టైమ్స్ స్వేర్ నిర్మాణంతో అక్కడ వాణిజ్య కూడలి అభివృద్ధి చెందింది. ఈ నేపథ్యంలో టీ%-%స్వేర్ నిర్మాణంతో తెలంగాణలోని రాయదుర్గం కూడా వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. న్యూయార్క్‌లో ఉన్న టైమ్స్ స్క్వేర్.. వాణిజ్య కూడలిగానే కాకుండా.. పర్యాటక ప్రదేశంగా, వినోద కేంద్రంగా ఉంది. వ్యాపార ప్రకటనలు చేయడానికి డిజిటల్ బిల్‌బోర్డ్‌ల ద్వారా ఈ ప్రాంతం వెలిగిపోతుంది. ఈ క్రమంలోనే.. రాయదుర్గంలోనూ టీ%-% స్క్వేర్ ద్వారా అలాంటి వాతావరణాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే.. ప్రాజెక్ట్ కోసం పేరున్న ప్రైవేట్ డెవలపర్‌లను గుర్తించి, ఎంపిక చేసేందుకు బిడ్ ప్రక్రియను నిర్వహించనున్నారు. ఈ మేరకు టెండర్లను ఆహ్వానించారు.టీ%-%స్క్వేర్ ప్రకటనతో రాజధాని హైదరాబాద్ వాసుల్లో ప్రత్యేక ఉత్సాహం కనబడుతోంది. ఈ ప్రాజెక్ట్ హైదరాబాద్ ఖ్యాతిని మరింతగా మెరుగుపరచడమే కాకుండా ప్రధాన పర్యాటక, వాణిజ్య కేంద్రంగా కూడా మారనుందని నగరవాసులు భావిస్తున్నారు. విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో ఇలాంటి ఐకానిక్ టవర్లు రావాల్సిన అవసరం కూడా ఉందని అభిప్రాయపడుతున్నారు.

# అబార్షన్లకు కేరాఫ్ అడ్రస్‌గా సూర్యపేట

నల్గొండ, జూలై 16 (ప్రజాస్వరం):

తెలంగాణలో సూర్యపేట జిల్లా భ్రూణ హత్యలకు అడ్డాగా మారింది. చివ్వెంల మండలం ఎంజీ నగర్ తండాకు చెందిన ఏడు నెలల గర్భిణి సుహాసిని(26) ఇటీవల మృతిచెందింది. దీంతో ఆ జిల్లాలో లింగ నిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి ఎంతలా సాగుతుందో తెలియజేసింది. జిల్లాలో కొంత మంది వైద్యరంగంలో మాఫియాగా ఏర్పడి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మాత్రమే సంబంధిత అధికారులు కన్ని రోజులు హడావుడి చేస్తున్నారు. తర్వాత చూసీ చూడనట్లు వ్యవహిస్తున్నారు. దీంతో సూర్యపేట జిల్లా లింగ నిర్ధారణకు, అబార్షన్లకు కేరాఫ్‌గా మారింది.సూర్యపేట జిల్లా కేంద్రంలోని కొన్ని ఆస్పత్రులు భ్రూణ హత్యలకు ప్రసిద్ధ చెందాయి. ఇటీవల కోదాడ ప్రాంతంలోనూ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఆర్ఎంపీలు మీడియేటర్లుగా ఉంటూ ఈ దందా సాగిస్తున్నారు. తద్వారా ఇటు ఆస్పత్రులు లక్షల్లో, ఆర్ఎంపీలు వేలల్లో సంపాదిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే చిన్న చిన్న క్లీనిక్‌లలో గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు చేస్తున్నారు. ప్రత్యక్షంగా పట్టుబడినా.. జరిమానాలు విధించినా.. కేసులు నమోదు చేసినా.. వెనక్కు తగ్గడం లేదు.భ్రూణ హత్యలను నియంత్రించేందకు ప్రభుత్వం పీసీ%-%పీఎన్‌డీటీ(ప్రీ కన్‌సెప్షన్, ప్రీ నెటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్) చట్టంపై ప్రజలకు అవాహన కల్పిస్తున్నారు. ఈమేరు రాష్ట్ర వ్యాప్తంగా వంద రోజుల కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం అది కొనసాగుతోంది. ఇక సూర్యపేట జిల్లాలో ఈమేరకు కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామీణులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. చట్ట ప్రకారం లింగ నిర్ధారణ చేసే వారికి, స్కానింగ్ నిర్వహించే వైద్యులకు, కుటుంబాలకు గరిష్టంగా ఏడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి. అయితే సూర్యపేట జిల్లాలో ఈ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. అధికారులు హెచ్చరికలకే పరిమితం కావడంతో నిర్వాహకులు వాటిని లెక్కచేయడం లేదని తెలుస్తోంది.



## ఇటీవల కొన్ని చర్యలు..

ఇదిలా ఉంటే.. లింగనిర్ధారణ, అబార్షనుల చేసే ఆస్పత్రులపై అధికారుల కొరడా ఝుళిపిస్తున్నారు. ఏడాదిన్నర క్రితం సూర్యాపేటలోని ఓ వైద్యురాలు గర్భవిచ్ఛిత్తి చేస్తున్నట్లు గుర్తించారు. ఆమెకు జరిమానా విధించారు. ఏడాది క్రితం ఎంజీ రోడ్డులోని ఓ క్లినిక్‌లో మహిళలకు ఆబార్షన్లు చేస్తున్నట్లు గుర్తించారు. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి క్లినిక్ సీజ్ చేశారు. రామలింగేశ్వర థియేటర్ రోడ్డులోనూ మరో ప్రైవేటు ఆస్పత్రిని ఇదే కేసులో సీజ్ చేశారు. ఇలా అధికారులు చర్యలు తీసుకుంటుంటే నిర్వాహకుల మాత్రం పేర్లు మార్చి మళ్లీ కొత్తగా నిర్వహిస్తున్నారు. అందులోనూ అదే దందా కొనసాగిస్తున్నారు. దీంతో అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా లింగనిర్ధారణ, భ్రూణహత్యలు కొనసాగుతున్నాయి.ఆడపిల్లలను ఇప్పుడు లక్ష్మీదేవిగా భావిస్తున్నారు. చాలా మందిలో ఈమేరకు అవగాహన వచ్చింది. అయినా సూర్యపేట జిల్లాలో మాత్రం ఇప్పటికీ ఆడపిల్లలపై వివక్ష కొనసాగుతోంది. అందుకే ఈ జిల్లాలో స్త్రీపురుష నిష్పత్తి తగ్గుతోంది. ముఖ్యంగా గ్రామీణులు, తండాల ప్రజలు ఆడపిల్లలను వద్దనుకుంటున్నారు. చదువుకున్నవారు కూడా ఆడపిల్లలపై వివక్ష చూపుతున్నారు. దీంతో గర్భంలోనే ఆడపిల్లలను చంపేస్తున్నారు. ఇక కొన్ని వివాహేతర సంబంధాల కారణంగా గర్భ విచ్ఛిత్తి చేస్తున్నారు.

# చేయి పట్టుకునేందుకు మరో పదిమంది రెడీ

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):

పదేళ్ల పాటు గులాబీ పార్టీకి కంచుకోటగా ఉన్న ఆ జిల్లా ఇప్పుడు ఖాళీ అవుతోంది. కనీసం జెండా మోసే నాయకుడు లేరన్నట్లుగా పరిస్థితి మారింది. ఇప్పటికే ఓ %మీూా% హస్తం గూటికి చేరగా.. మరో 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. అదే జరిగితే పార్టీ పరిస్థితి ఏంటని గులాబీనేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జోగులాంబ గద్వాల జిల్లా పదేళ్లుగా %దీ=ా%కు కంచుకోటగా ఉండేది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోక వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. ఉద్యమపార్టీగా, తెలంగాణ సాధించిన పార్టీ అని చెప్పుకున్న %దీ=ా% నేతలు.. పదేళ్లు అధికారంలో తిరుగులేని విధంగా తమ హవా సాగించారు. గులాబీ జెండాను రెపరెపలాడించిన బీఆర్ఎస్ పరిస్థితి గద్వాల జిల్లాలో అగమ్యగోచరంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంటే రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విజయం సాధించింది. అలంపూర్ నుంచి ఎలాంటి గుర్తింపు లేని %దీ=ా% అభ్యర్థి విజయుడి విజయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.గద్వాల నుంచి బీఆర్ఎస్ %మీూా%గా విజయం సాధించిన బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఇటీవల తన గురువు అయిన మంత్రి జూపల్లి కృష్ణారావు ద్వారా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇక.. పార్టీ బాధ్యతలు మోయాల్సిన అలంపూర్ నుంచి బీఆర్ఎస్ ఎంఎల్ఏగా విజయం సాధించిన విజయుడు, ఎంఎల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కూడా త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు టాక్ వినిపిస్తోంది. అదే జరిగితే జోగులాంబ గద్వాల జిల్లాలో కారు పార్టీ పూర్తిగా ఖాళీ అయినట్లే. .దీనితో జిల్లాలో బీఆర్ఎస్ జెండా మోసే నాయకుడేవరనే సందేహాలు వ్యక్తమౌతున్నాయి.అలంపూర్ నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ పార్టీల కన్నా వ్యక్తుల ప్రభావమే ఎక్కువ. ఆ వ్యక్తులు ఎటు వైపు మొగ్గు చూపితే ఆ పార్టీలదే విజయం. ఇప్పుడు పరిస్తితులు పూర్తిగా మారిపోతున్నాయట. తాజా రాజకీయాల నేపథ్యంలో అన్ని మండలాల్లోనూ %దీ=ా%లో కొనసాగుతున్న నేతలంతా ఇప్పుడు అయోమయంలో పడ్డారట. పార్టీపై పట్టు ఉన్నవారంతా వెళ్లిపోతే తమ పరిస్థితి ఏంటనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం, మాజీ ఎంపీ మంద జగన్నాథంతో పాటు అలంపూర్ ఎంఎల్ఏ టికెట్ కోసం చివరి వరకూ ప్రయత్నించిన మాజీ ఎంఎల్ఏ అబ్రహం కాంగ్రెస్ గూటికి చేరారు. తరువాత జరిగిన పరిణామాల్లో మంద జగన్నాథం.. %దీ్రా% తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మరోవైపు.. మాజీ ఎంఎల్ఏ అబ్రహం కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు %=ా% ప్రవీణ్ కుమార్ బీఎస్పీకి రాజీనామా చేసి.. %దీ=ా%లో చేరి నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు చల్లా విజయుడు పార్టీ మారితే నియోజకవర్గ బరువు బాధ్యతలవప.. %=ా% ప్రవీణ్ కుమార్ తీసుకుంటారా.. తిరిగి మంద జగన్నాథానికి ఇస్తారా అనే చర్చ సాగుతోంది.తాజాగా గులాబీ అధినేతకు షాక్ ఇచ్చేందుకు మరికొంతమంది %మీూా%లు సిద్ధమయ్యారు. ప్రత్యేకించి గ్రేటర్‌లో ఆపరేషన్ ఆకర్ష్‌పై ఫోకస్ పెట్టారు. త్వరలోనే కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కారు దిగనున్నారు. అదేబాటలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ లు ఉన్నారు. ఎమ్మెల్యేల వలసల్ని ఆపేందుకు కేసీఆర్ చేస్తున్న బుజ్జగింపులు పనిచేయడం లేదు. నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యమని ప్రజాప్రతినిధులు తేల్చి చెబుతున్నారు.త్వరలో మరో 17 మంది చేరికతో కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్పీ విలీనం కానుంది. అటు అసెంబ్లీలో ఇప్పటికే కాంగ్రెస్ బలం 75కు చేరింది.

# ఏటీసీలుగా ఐటీఐలు

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):

తెలంగాణలోని ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ పట్టనుంది. కాలానుగుణంగా ప్రస్తుత ఉద్యోగావసరాల మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక నైపుణ్య కేంద్రాలుగా (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ తీర్చిదిద్దాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాల ఆధునికీకరణ ప్రాజెక్టును రూపకల్పన చేసింది. ఇందులో భాగంగా ఐటీఐలలో కొత్త ట్రేడ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని మొత్తం 65 ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం మొదట భావించింది. అయితే.. తొలి దశలో 25 అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. జిల్లాల్లోని కొన్ని కళాశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, స్థలాభావం సమస్యలు ఉండటం, మరికొన్ని అద్దె భవనాల్లో ఉండటం తదితర పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాదికి 25 ఐటీఐలను ఏటీసీలుగా మార్చాలని, వచ్చే ఏడాదికి మరో 25 కళాశాలల్లో ప్రాజెక్టు అమలు చేయాలని నిర్ణయించింది. తొలి దశలో హైదరాబాద్‌లో అత్యధికంగా ఐదు ఏటీసీలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో ఏటా లక్ష మందికి నైపుణ్య శిక్షణ అందించాలనే లక్ష్యంతో దాదాపు రూ.2,700 కోట్ల ఖర్చుతో నైపుణ్య శిక్షణ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పలు కోర్సులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మానవ వనరులు, తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ ప్రాజెక్ట్ అమలు కోసం 'టాటా టెక్నాలజీస్'తో ఇటీవల ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఆ ప్రకారం కేంద్రాల ఆధునికీకరణ పనులు మొదలుపెట్టారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి మల్లేపల్లి ఐటీఐలో శంకుస్థాపన చేసిన ఏటీసీ కేంద్రం మూడు నెలల్లోనే అందుబాటులోకి వచ్చేలా వేగంగా పనులు జరుగుతున్నాయి.

**ఉపాధికి గ్యారంటీ...**

టాటా టెక్నాలజీస్ ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని ఐటీఐలను 'ఏటీసీ'లుగా తీర్చిదిద్దుతోంది. అక్కడి ప్రభుత్వాల సహకారంతో దిగ్విజయంగా కొనసాగిస్తోంది. టాటా సంస్థ 'పరిశ్రమ 4.0' పేరుతో దీర్ఘకాల, స్వల్ప వ్యవధి కోర్సులతోపాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల కోసం బ్రిడ్జి కోర్సులనూ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో ప్రొడక్ట్ డిజైన్ డెవలప్‌మెంట్, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఐవోటీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ప్రొడక్ట్ డిజైన్ డెవలప్‌మెంట్, ఆడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్, మోడ్రన్ ఆటోమేటివ్ మెయింటెనెన్స్, ప్రొటోటైపింగ్ ఇండస్ట్రియల్ రోబోటిక్స్ ఆర్క్ వెల్డింగ్, ఏఐ ఆధారిత వర్చువల్ వెల్డింగ్-పెయింటింగ్ తదితర కోర్సులు ఉన్నాయి. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్(%చీజఉ%) గుర్తింపు ఉన్న ఆయా కోర్సులను పూర్తిచేసే వారికి ప్రముఖ కంపెనీల్లో ఉపాధికి ఢోకా ఉండదని సర్కారు భావిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే 'ఆధునిక నైపుణ్య కేంద్రాల్లో' కొత్త కోర్సుల బోధనకు సంబంధించి ఒక్కో కేంద్రానికి అదనంగా దాదాపు 12 నుంచి 15 వరకు ఫ్యాకల్టీలు అవసరం ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలలో బోధకుల పోస్టుల్లో దాదాపు సగం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొత్త కోర్సుల బోధనకు సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించుకోవాలని ఉపాధి కల్పన శాఖ భావిస్తోంది. అందుకు అనుగుణమైన విద్యార్హతలు కలిగిన వారిని ఎంపికచేసే బాధ్యతను టాటా సంస్థకే అప్పగించే అవకాశం ఉంది.

# లంకమల అభయారణ్యంలో కూంబింగ్

**ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. స్మగ్లర్లు పరారీ**



బద్వేలు, జూలై 16 (ప్రజాస్వరం):

లంకమల అభయారణ్యంలోని సిద్ధవటం రేంజ్, సిద్ధవటం బీట్ నందు సమస్యాత్మక ప్రదేశాలలో నిర్వహించిన కూంబింగ్ లో 18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని స్మగ్లర్లు పరారీ అయినట్లు రేంజర్ కళావతి తెలిపారు. రేంజర్ మాట్లాడుతూ కడప జిల్లా అటవీ శాఖాధికారి పి. వి సందీప్ రెడ్డి ఆదేశాల మేరకు సిద్ధవటం ఫారెస్ట్ ఫోర్స్ స్పెషల్ టీమ్స్ గా ఏర్పడి కూంబింగ్ నిర్వహించామన్నారు. సిద్ధవటం రేంజర్ కళావతి ఆధ్వర్యంలో గొల్లపల్లి డిప్యూటీ రేంజర్ ఓబులేసు, సిద్ధవటం ఇంచార్జ్ ఫారెస్ట్ బీటు అధికారి పెంచల్ రెడ్డి, సిద్ధవటం అసిస్టెంట్ బీటు అధికారి హైమవతి దేవి, బేస్క్యాంప్ సిబ్బంది, పోటెక్షన్ వాచేర్స్ తో కూడిన స్పెషల్ టీం సిద్ధవటం రేంజ్ లోని సిద్ధవటం బీట్ నందు సమస్యాత్మక ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొంతమంది ఎర్రచందనం చెట్లను నరుకుతూ కనిపించారన్నారు. వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా, దుంగలను అక్కడే వదిలేసి పారిపోయారన్నారు. మొత్తం 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, స్మగ్లర్ల కోసం స్పెషల్ టీమ్స్ గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

# వడివడిగా రైతు భరోసా అడుగులు

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):




తెలంగాణలో రుణమాఫీకి సంబంధించిన రోజుకో విషయం వెలుగులోకి వస్తోంది. ఇప్పటి వరకు అధికారిక ఉత్తర్వులు రాకపోయినా రోజు లీక్ మాత్రం రైతులను ఊరిస్తున్నాయి. ఇప్పుడు కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ చేయనున్నారని తాజాగా అందుతున్న సమాచారం. దీనికి సంబంధించిన విధివిధానాలు ఇవాళ కానీ రేపు కానీ వెలువడే ఛాన్స్ ఉందన అంటున్నారు. రేషన్ కార్డు, లేదా పంచాయతీ శాఖ వద్ద ఉన్న రికార్డులు ఆధారంగా కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి సంబంధించిన డేటాను కూడా సేకరించారని తెలుస్తోంది. దీని ఆధారంగానే ఫైనల్ లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేస్తారని చెబుతున్నారు. ఫైనల్ జాబితాను సిద్ధం చేసిన తర్వాత ఆ రైతు కుటుంబానికి ఎన్ని బ్యాంకు ఖాతాల్లో అప్పులు ఎంత ఉన్నప్పటికీ గరిష్ఠంగా రెండు లక్షల రూపాయలు వరకు మాత్రమే మాఫీ చేయనున్నారు. విధివిధానాలు పూర్తి స్థాయిలో రెడీ అయిన తర్వాత గ్రామల వారీగా లిస్ట్ రెడీ చేస్తారు. తర్వాత బ్యాంకు అధికారులతో కలిసి ఫైనల్ జాబితా రూపొందిస్తారు. తెలంగాణ వ్యాప్తంగా రుణమాఫీ చ్ఛేయలంటే 31 వేల కోట్లు అవసరం అవుతాయని ప్రాథమికంగా నిర్ధారించారు. రుణమాఫీకి పీఎం కిసాన్ రూల్స్ పాటించాలని మొదటి నుంచి భావిస్తున్న ప్రభుత్వం ఆ దిశగానే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న రుణాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని ఇప్పటికే ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఐటీ కట్టే ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులకు , రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారికి రుణమాఫీ లేదని మొదటి నుంచి ప్రభుత్వం చెబుతూ వస్తోంది. చిరు ఉద్యోగులకు కాస్త ఊరట ఇవ్వాలని దీని కూడా ఓ స్లాబ్ పెట్టాలని భావిస్తోంది ప్రభుత్వం. ముందు పిఎం కిసాన్ రూల్స్ ప్రకారం రుణమాఫీ చేసి నిధులు మిగిలితే తర్వాత ప్రాధాన్యత కింద ఉన్న వారి రుణాలు మాఫీ చేయాలని భావిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే జాబితాను సిద్ధం చేయనున్నారు. మరోవైపు బంగారం కుదవపెట్టి వ్యవసాయ రుణాలు తీసుకోవాలని భావిస్తున్న వారికి కూడా రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వ ఆలోచనగా ఉన్నట్టు సమాచారం. గ్రామీణ బ్యాంకుల్లో పట్టాదారు పాస్ బుక్‌ను జత చేసిన వాటికే దీన్ని వర్తింప చేయాలని కూడా చూస్తున్నారు. పట్టణాల్లో ఇలాంటి రుణాలు తీసుకుంటే వాటిని మినహాయించాలని చూస్తున్నారు. మరోవైపు రైతు భరోసాపై ప్రజాభిప్రాయ సేకరణ ఇంకా కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులు కూడా ప్రజలతో మమేకమై వారి నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నారు. ఖమ్మం జిల్లాలో పాలేరు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పోలాల్లో పని చేస్తున్న మహిళలతో మాట్లాడారు రైతు భరోసా ఎలాంటి వారికి ఇస్తే బాగుటుందో అని వారిని ప్రశ్నించారు. వారు చెప్పిన సమాధానాలు సమస్యలను మంత్రి విని అక్కడి నుంచి బయల్దేరారు.

## యువజంట బలవన్మరణం

నిజామాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):



నిజామాబాద్ జిల్లాలో యువజంట బలన్మరణానికి పాల్పడింది. దంపతులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. తమపై బంధువులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదని తెలియజేస్తూ వీడియో చిత్రీకరించి, ఆ సెల్ఫీ వీడియోను పోలీసులకు పంపించారు. అనంతరం ప్రాణాలను తీసుకున్నారు. వారిని కాపాడేందుకు పోలీసులు ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఈ దారుణ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం ఫకీరాబాద్-మిట్టాపూర్ మధ్యలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలం హెగ్డోలికి చెందిన అనిల్ (28), అదే మండలానికి చెందిన శైలజ (24)కు ఏడాది కిందట వివాహమైంది. ఎంతో సాఫీగా సాగిపోతున్న వీరి కాపురంలో బంధువులు చిచ్చుపెట్టారు. ఈ క్రమంలో ఓ ఇంటర్వ్యూకు వెళ్తున్నట్లు దంపతులిద్దరూ కుటుంబీకులకు చెప్పి, సోమవారం ఇంటి నుంచి వెళ్లారు. అనంతరం తాను గతంలో ఓ తప్పు చేశానని, దాన్ని భర్త క్షమించినా బంధువులు సూటిపోటి మాటలతో చిత్రహింసలకు గురిచేస్తున్నారని దంపతులు ఇద్దరూ సెల్ఫీ వీడియోను చిత్రీకరించారు. వారు తమపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తట్టుకోలేక ఇద్దరం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటున్నట్లు వీడియో చిత్రీకరించారు. అనంతరం ఈ వీడియోలను కోటగిరి ఎస్సై సందీప్‌కు పంపారు.ఈ వీడియో చూసిన ఆయన వెంటనే నవీపేట ఎస్సై యాదగిరిగౌడ్‌కు వీడియోతోపాటు వారి సెల్‌ఫోన్ నంబరు పంపి, అప్రమత్తం చేశారు. దంపతులు ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరి వద్దకు వస్తున్నట్లు వీడియోలో చెప్పారు. ఆ సమాచారం ప్రకారం స్థానిక పోలీసులు బాసర వంతెన దగ్గరకు వెళ్లి మాటువేశారు. ఎంత గాలించినా జాడ కనిపించలేదు. దీంతో బాధితుల ఫోన్ నంబరును ట్రాక్ చేయగా ఫకీరాబాద్-మిట్టాపూర్ మధ్య ఉన్నట్లు తెలిసింది. వెంటనే నవీపేట ఎస్సై గుర్తించి అక్కడికి చేరుకునేటప్పటికే ఆలస్యమైంది. అనిల్, శైలజ.. ఇద్దరి మృతదేహాలు రైలు పట్టాలపై కనిపించాయి. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. యువ దంపతులు ఆత్మహత్యతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు

## చిన్నారులను అంగన్ వాడీల్లో చేర్పించాలి

**హుజూర్ నగర్, జూలై 16, (ప్రజాస్వరం) :**
**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అమ్మ మాట- అంగన్వాడి బాట రెండో రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం హుజూర్నగర్ ఐసీడీఎస్ అంగన్ వాడీ 3,5, 7, 10 కేంద్రాల పరిధిలోని టీచర్ల ఆధ్వర్యంలో పీర్ల కొట్టం బజార్ వద్ద కౌన్సిలర్ సంఘ బంధం సభ్యులు ఏఎల్ఎంఎస్ సీ కమిటీ సభ్యులు, ఆర్పీ లు, తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 16వ వార్డు కౌన్సిలర్ కారంగుల విజయ మాట్లాడుతూ అంగన్ వాడీ ముద్దు ప్రైవేట్ బడి వద్దు అంటూ రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్ వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. ఆటపాటలతో విద్యాబోధన, ప్రైవేటు స్కూలుకు దీటుగా అంగన్ వాడీ టీచర్లు ఆంగ్ల బోధన లో మీ పిల్లలకు నేర్పుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ పీలు సుధాసుజాత మారెమ్మ, సంఘ బంధం సభ్యులు నాగలక్ష్మి, పద్మ కళావతి, తల్లులు పద్మ తిరపమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.**



## అవినీతిని ప్రశ్నిస్తే... ఇంతే సంగతులు

కరీంనగర్, జూలై 16 (ప్రజాస్వరం):

కరీంనగర్ కలెక్టరేట్ ముందు సామాజిక కార్యకర్త రేకుర్తి చెందిన దుర్గం మనోహర్ వినూత్న ఆందోళనకు దిగాడు. రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ ఆవేదనతో ఆందోళన వ్యక్తం చేశారు. ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డ అధికారులు సొంత భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవడం పట్ల అధికారులు అన్నం తింటున్నారా?.. పెండ తింటున్నారా?.. డబ్బులే కావాలా?.. మందు తాగుతారా? అంటూ కలెక్టరేట్ ముందు బైఠాయించి విస్తరాకులో మందు, డబ్బులు, పెండ పెట్టి నిరసన తెలిపారు. అధికారుల అవినీతి అక్రమాలను సామాజిక కార్యకర్తగా ప్రశ్నించినందుకే రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆరోపించారు. గత మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూ ఇచ్చిన వినతి పత్రాలు ఆయన చేస్తున్న పోరాటానికి సంబంధించిన ఆధారాలను ప్లెక్సీ రూపంలో ప్రదర్శించి నిరసన తెలిపారు.కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన దుర్గం మనోహర్ తండ్రి మల్లయ్య పేరిట సర్వే నంబర్ 432లో రెండెకరాల 16 గుంటల భూమి ఉంది. గత 30 సంవత్సరాల కితం కొనుగోలు చేసి పట్టా చేసుకున్న భూమిలో 4 గుంటల 25 గజాల స్థలాన్ని బండ కిషోర్ రెడ్డికి విక్రయించి పట్టా చేశారు. మూడేళ్ల క్రితం తండ్రి మల్లయ్య మృతి చెందడంతో మిగతా భూమి తల్లి పేరిట విరాసత్ చేశారు. నలుగురు కొడుకులు ఉండడంతో మనోహర్ వాటాకు వచ్చే 21 గుంటల భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చాలన్ కట్టి ధరణి వెబ్ సైట్ లో స్లాట్ బుక్ చేసుకున్నాడు. రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ చేయకుండా మూడేళ్లుగా తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎమ్మార్వో పైనే ఫిర్యాదు చేశావని అధికారులను అవినీతిపరులుగా చిత్రీకరించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోనే రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ ఇబ్బందుల గురిచేస్తున్నారని మనోహర్ ఆవేదనతో తెలిపారు.సామాజిక కార్యకర్త అయిన దుర్గ మనోహర్ సమాజంలో జరిగే అవినీతి అక్రమాలపై గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18 వ డివిజన్ లోని సర్వే నెంబర్ 55, 137 లో గల ప్రభుత్వ భూమి, మద్దినాల ప్రభుత్వ భూములు కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జరుగుతుంటే అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆందోళనకు దిగారు. కాలేజీ స్థలాలకు ఇంటి నంబర్లతో విద్యుత్ మీటర్లు మంజూరు చేసిన దానిపై లైన్మెన్ పై ట్రాన్స్ కో ఎస్ఈకి ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. తన దృష్టికి వచ్చిన ఏ ఒక్క అవినీతి అక్రమాలను సహించకుండా అధికారులకు ఫిర్యాదు చేసి వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో మనోహర్ సొంత సమస్య జటిలంగా మారింది.రేకుర్తిలో ప్రభుత్వ భూములు కబ్జా, అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ మున్సిపల్ అధికారులపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో కక్షగట్టి తన సొంత భూమిని రిజిస్ట్రేషన్ కాకుండా అడ్డుకుంటున్నారని మనోహర్ ఆవేదనతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వారసత్వంగా రావాల్సిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని దానిలో స్లాట్ బుక్ చేసుకొని వెళితే తమపైనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తావా అంటూ తహశీల్దార్ భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న తహసిల్దార్ ను అడిగితే ఆర్డీఓ దగ్గర ఫైల్ పెండింగ్ లో ఉందంటూ తిప్పుకుంటున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ కు, సీసీఎల్ఏ లో ప్రజాదర్బార్ లో ఫిర్యాదు చేస్తే ప్రస్తుత జిల్లా కలెక్టర్ ఆర్డీవోను విచారించి తగు చర్యల చేపట్టాలని ఆదేశించారని ఆర్డీవో మాత్రం గతంలో ఉన్న ఎమ్మార్వోకు వత్తాసు పలుకుతూ తమ శిష్యుడు పైనే ఫిర్యాదు చేస్తావా అంటూ తన ఫైల్ ను పెండింగ్ లో పెట్టి రిజిస్ట్రేషన్ కాకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో అధికారులు అన్నం తింటున్నారా...పెండ తింటున్నారా.. డబ్బులే కావాలా.. మందు తాగుతారా.. అంటూ నిరసన తెలుపుతున్నానని మనోహర్ ఆవేదనతో తెలిపారు. నిజాయితీగా అక్రమాలపై పోరాడితే ఇబ్బందులకు గురి చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తన గోడును పట్టించుకోని తన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారులు మాత్రం ఈ విషయంపై మాట్లాడేందుకు నిరాకరించారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం యత్నం

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):

తెలంగాణ నార్నర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీ ఎన్పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కర్నాటి వరుణ్ రెడ్డి విద్యుత్తు సంబంధ సమస్యలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.విద్యుత్తు అంతరాయాలను తగ్గించడంతో పాటు అందుబాటులో ఉన్న సాంకేతికను అందిపుచ్చుకునేందుకు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో అస్సెట్ మ్యాపింగ్ ట్రాకింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సంస్థ పరిధిలోని అన్ని 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నెంబర్ పెయింటింగ్ ప్రక్రియను ప్రారంభించారు.ఈ పద్ధతితో విద్యుత్తు సంబంధ సమస్యలు తొందరగా పరిష్కరించేందుకు అవకాశం ఉండటంతో పాటు అంతరాయాలను అరికట్టే వీలుంటుందని సీఎండీ కర్నాటి వరుణ్ తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే ఎన్ పీడీసీఎల్ ఆఫీసర్లు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.టీజీ ఎన్పీడీసీఎల్ లో అస్సెట్ మ్యాపింగ్ వల్ల స్తంభాల వారీగా పెట్రోలింగ్ సులభంగా చేపట్టే అవకాశం ఉంటుందని సీఎండీ వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. అంతేగాకుండా మెయింటెనెన్స్ ను కూడా ఎప్పటికప్పుడు ట్రాక్ చేసే వీలు ఉంటుందని తెలిపారు. అంతరాయాలు, ట్రాన్స్ ఫార్మర్ల వైఫల్యాలు కూడా ట్రాక్ చేసుకునే సౌల్యభ్యం ఉంటుందని పేర్కొన్నారు.ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నెంబర్ ద్వారా అక్కడి లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకునే ఆస్కారం ఉంటుందని, వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించవచ్చని వెల్లడించారు. దీని ద్వారా అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, ముందస్తు సమాచారం తెలుసుకోవడానికి, సమస్యలు ఏర్పడక ముందే గుర్తించడానికి ఎంతో దోహద పడుతుందని సీఎండీ వివరించారు.కరెంట్ పోల్స్ కు యూనిట్ నెంబర్ కేటాయింపు ప్రక్రియ వేగంగా సాగుతోందని, ఇప్పటివరకు సుమారుగా 1,862 ఫీడర్లకు నెంబరింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని సీఎండీ వరుణ్ రెడ్డి తెలిపారు. వాటి డిజిటలైజేషన్ తో పాటు ప్రీ మాన్సూన్ ఇన్ స్పెక్షన్ కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మిగతా ఫీడర్లను రాబోయే రెండు నెలల సమయంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని సీఎండీ వివరించారు.ప్రీ మాన్సూన్ ఇన్ స్పెక్షన్ (పీఎంఐ) లో భాగంగా ముందస్తు విద్యుత్ లైన్ల నిర్వహణ కార్యక్రమం చేపట్టి, ఎప్పటికప్పుడు పీఎంఐ ఆప్ లో వివరాలు అప్ లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. పోల్ నెంబర్ పెయింటింగ్ ద్వారా అస్సెట్ మ్యాపింగ్ చేసిన అన్ని రకాల విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లను సమయానుసారంగ నిర్వహణ చేపట్టడంతో పాటు అప్ గ్రేడ్ చేసేందుకు కూడా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ ప్రక్రియ తద్వారా సమస్యలను పరిష్కరించడం, అంతరాయాల సమయాన్ని తగ్గించడంతో పాటు వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సరఫరా అందించేందుకు పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింత సాకేంతికతకు అందుబాటులోకి తీసుకు వచ్చి విద్యుత్తు సంబంధ సమస్యలపై స్పెషల్ ఫోకస్ పెట్టనున్నట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వివరించారు.

## బీజేపీ, బిఆర్ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ ఫైర్

రాజన్న, జూలై 16 (ప్రజాస్వరం):

ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ బీజేపీ,బీఆర్ఎస్ లపైవిరుచుకపడ్డారు. తెలంగాణలోనూ ఏక్ నాథ్ షిండే ప్రయోగాన్ని అమలు చేయబోతున్నారని అయన ఫైర్ అయ్యారు. బీజేపీతో బీఆర్ఎస్ విలీనానికి అంగీకరించకపోతే హరీష్ రావును అడ్డంపెట్టుకొని భ్రష్టు రాజకీయాలు చేయాలని ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్సు దెబ్బ తీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ కలిసి డ్రామాలు ఆడుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల రహస్య ఒప్పందాలకు నెమ్మదిగా తెర దించుతున్నాయన్నారు.. ఢిల్లీలో కేటీఆర్, హరీష్ రావు బీజేపీతో సంప్రదింపులు జరిపారు. హరీష్ రావును పొగడ్తలతో ముంచెత్తడం వెనుక ఆయనతో రాజీనామా చేయించి బీజేపీ తరపున పోటీ చేయించే ఆలోచన ఉన్నారు. అందుకే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినా సిద్దిపేటలో హరీష్ రావు మళ్లీ గెలుస్తాడని బండి సంజయ్ అంటున్నారు. హరీశ్రావు పై వచ్చిన పొగడ్తలను బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సమర్థిస్తారా..? ఆ నేతల వ్యాఖ్యలను వరుసగా పరిశీలిస్తే మెదక్ లో బీజేపీ, బీఆర్ఎస్లు కుమ్మక్కైయ్యాయని స్పష్టంగా అర్థమవుతుంది..

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):

హైదరాబాద్ లో ఈ సాయంత్రం నుండి భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలతో జీహెచ్ఎంసీ, హెచ్ఎండిఎ , వాటర్ వర్క్స్ , డిఆర్ఎఫ్ , ఎన్డిఆర్ఎఫ్ బృందాలు ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. హైదరాబాద్ లో భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా ఉండడం , ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని అధికారులకు తెలిపారు... హైదరాబాద్ లో భారీ వర్షం కురిసినప్పుడు నీళ్ళు నిల్వ ఉండే 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది ఉండి నీళ్ళు వెంటనే వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైతే వర్షం కురిసి ఇబ్బందులు ఉన్నాయో ఆయా ప్రాంతాల్లో అధికారులకు ప్రజలు పిర్యాదు చేసిన వెంటనే స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.. వర్షం కురిసిన సమయంలో లోతట్టు ప్రాంతాలు వారిని అప్రమత్తం చేయాలి. పాత భవనాల వద్ద ఉన్నవారిని ఖాళీ చేపించాలి. గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలి.వర్షాలు కురిసినపుడు విద్యుత్ స్థంబాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పోలీస్,జీహెచ్ఎంసీ , హెచ్ఎండిఎ వివిధ విభాగాల అధికారులు ప్రజలు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## మద్యం ప్రియులకు కిక్కిచ్చే న్యూస్..

### స్విగ్గీ, జొమాటోలో త్వరలో లిక్కర్ హోమ్ డెలివరీ..!

హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):

ప్రస్తుతం అంతా ఆన్‌లైన్ మయమైపోయింది. ఫుడ్ నుంచి గ్రాసరీస్ వరకూ అంతా ఆన్‌లైన్ ద్వారానే ఆర్డర్ చేసుకుంటున్నారు. ఇదే ఆసరాగా చేసుకొని పలు ఆన్‌లైన్ సంస్థలు ఆదాయాన్ని పెంపొందించుకునే మార్గాలను అన్వేశిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థలు స్విగ్గీ జొమాటో కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు మద్యం ప్రియులకు కిక్కిచ్చే న్యూస్‌ను చెప్పాయి. స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్ వంటి యాప్స్ త్వరలో బీర్, వైన్, లిక్కర్ వంటి తక్కువ ఆల్కహాల్ డ్రింక్స్ ను హోమ్ డెలివరీ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి.



# బీజేపీతో బంధం... గులాబీ అడుగులు

**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):**

2019 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీతో తెగదెంపులు చేసుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. ఐదేళ్లు ప్రతిపక్షానికి పరిమితమయ్యారు. ఐదేళ్ల క్రితం జరిగిన పరాభవాన్ని గుర్తు చేసుకున్న చంద్రబాబు.. 2024 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే గెలవలేమని గ్రహించారు. దీంతో బీజేతో దోస్తీకి ఏడాదిపాటు ప్రయత్నించి సక్సెస్ అయ్యారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా పోటీ చేసి భారీ మెజారిటీతో ఏపీలో అధికారంలోకి వచ్చారు. వైసీపీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారు. ఇక ఇదేసమయంలో టీడీపీ ఒంటరిగా 16 ఎంపీ సీటుల గెలిచింది. బీజేపీ 3, జనసేన 2 ఎంపీస్థానాల్లో గెలిచాయి.ఇక కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ఈసారి 246 సీట్లకే పరిమితమైంది. 2019 ఎన్నికల్లో 303 సీట్లు గెలిచిన కమలం.. ఇప్పుడు మిత్రపక్షాల మద్దతు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎన్డీఏలో బీజేపీ తర్వాత ఎక్కువ సీట్లు సాధించిన టీడీపీ కీలకంగా మారింది. దీంతో బీజేపీ తన మిత్రపక్షాలు అయిన టీడీపీ, జేడీయూ మద్దతుతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.రాజకీయాల్లో చక్రం తిప్పడంలో చంద్రబాబు దిట్ట. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలోనూ ఆయన జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కేంద్రంలో కీలకంగా మారారు. దీంతో మరోమారు బాబు తనదైన పాలిట్రిక్స్ మొదలు పెట్టారు. ఒకవైపు కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏలో కీలకంగా ఉంటూనే.. పొరుగు రాష్ట్రం తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్‌తో తెరచాటు రాజకీయం మొదలు పెట్టారు. తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తెవడంతోపాటు తెలంగాణలో ఉంటున్న ఆంధ్రుల ప్రయోజనాలు, ఆస్తుల పరిరక్షణ కోసం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో అధికారం చేపట్టిన పక్షం రోజుల్లోనే 'కలుసుకుందాం' అని తన శిష్యుడు రేవంత్‌రెడ్డికి స్వయంగా లేఖరాశారు. విభజన హామీలపై చర్చల పేరుతో తెలంగాణలో చంద్రబాబునాయడు ముఖ్యమంత్రి హోదాలో అడుగు పెట్టారు. ఇక ఆయన రాక సందర్భంగా టీడీపీ నేతుల కూడా యాక్టివ్ అయ్యారు. చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు నుంచి పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు సూచన మేరకే ఇదంతా జరిగినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉంటే.. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి సుమారు 45 నిమిషాలు భేటీ అయ్యారు. ఆ మరుసటి రోజు చంద్రబాబు తెలంగాణ టీడీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దాం



అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెలపూడి గాంధీ చంద్రబాబును కలిశారు.ఇప్పటికే తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీ.. బీఆర్ఎస్‌ను టార్గెట్ చేసింది. ఇప్పుడు ఏపీలో అధికారం చేపట్టిన టీడీపీ కూడా బీఆర్ఎస్‌నే టార్గెట్ చేసింది. ఈ క్రమంలోనే టీడీపీ మాజీ నేతలు, బీఆర్ఎస్ ప్రస్తుత ఎమ్మెల్యేలు చంద్రబాబును కలవడం ఇందులో భాగమే అని తెలుస్తోంది.

తెలంగాణలో తన శిష్యుడికి మద్దతుగా ఉంటూనే విపక్ష బీఆర్ఎస్‌ను దెబ్బతీయడానికి వ్యూహాలు రచిస్తున్నారు. చంద్రబాబు నాయుడును కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెలపూడి గాంధీకి కాంగ్రెస్‌లో చేరాలని సూచించినట్లు సమాచారం. ఈమేరకు ప్రకాశ్‌గౌడ్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అరెకెలపూడి గాంధీ కూడా నేడో రేపో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.ఇదిలా ఉంటే.. తెలంగాణలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని టీడీపీ అధినేత భావిస్తున్నారు. ఈమేరకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. క్యాడర్‌కు కూడా దిశానిర్దేశం చేశారు. తన శిష్యుడి సహకారంతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీల్లో సర్పంచ్ పదవులతోపాటు, మండల పరిషత్‌లను కైవసం చేసుకోవాలని భావిస్తున్నారు. కుదిరితే ఒకటి రెండు జిల్లా పరిషత్లపైనా టీడీపీ జెండా ఎగురవేయాలని చూస్తున్నారు. దీంతో తెలంగాణలో టీడీపీ బలంగా ఉందన్న సంకేతం ఇవ్వాలని భావిస్తున్నారు. తద్వారా బీఆర్ఎస్ లేకుండా చేయాలని చూస్తున్నారు.

## రెండు ట్రాక్టర్లు సీజ్



**హుజూర్ నరగ్ రూరల్, జూలై 16, (ప్రజాస్వరం) :**

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నరెండు ట్రాక్టర్ లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం పెట్రోలింగ్ విధుల్లో భాగంగా లింగగిరి గ్రామానికి వెళ్తున్న క్రమంలో శివారులో వేములూరి వాగు నుంచి ఇసుకు లోడ్ తో వస్తున్న (TS 29 TB 5525, TS 29 TA 6335)రెండు ట్రాక్టర్లను గుర్తించి విచారించగా, అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. డ్రైవర్లు అగు మీసాల మట్టయ్య, మచ్చ రవి లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## గురుకుల విద్యార్థిని మృతి

**సూర్యాపేట, జూలై 16 (ప్రజాస్వరం):**

సూర్యాపేట జిల్లా దోసపాడు గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థిని సరస్వతి అనుమానస్పద మృతి చెందింది. జ్వరం వచ్చిందని సమాచారం హాస్టల్ సిబ్బంది ఇచ్చారు. నూతనకల్ మండలం మాచన పల్లి గ్రామానికి చెందిన సోమయ్య నవ్య దంపతుల కూతురు సరస్వతి మృతి చెందింది. సరస్వతి బీసీ వెల్ఫేర్ దోసపాడు గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతుంది. మంగళవారం ఉదయం తీవ్రమైన జ్వరం రావడంతో ఆసుపత్రికి తరలించామని ,ఆ లోపే చనిపోయింది అని హాస్టల్ సిబ్బంది చెబుతున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కూతురు చనిపోయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## పంచాయతీ ఎన్నికలపై..
# సీఎం రేవంత్ కీలక నిర్ణయం




**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంచాయతీల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గత పంచాయతీ ఎన్నికల అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు సీఎం రేవంత్‌కు వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళ్తే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని సీఎం అధికారులను ప్రశ్నించారు. కర్ణాటకలో 2015 లో, బిహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసిన వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర మాజీ మంత్రి కె.జానారెడ్డి, బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## ట్రైడెంట్ పరిశ్రమ వేలానికి రంగం సిద్ధం

**సంగారెడ్డి, జూలై 16 (ప్రజాస్వరం):**

జహీరాబాద్ మండలం కొత్తూరు.బి గ్రామంలోని ట్రైడెంట్ పరిశ్రమ వేలానికి రంగం సిద్ధం సిద్దమయింది. ఆగస్టు 14న వేలం వేస్తున్నట్టు తహసిల్దార్ రవిందర్ ప్రకటన విడుదల చేసారు. 1970లో నిజాం చక్కెర కర్మాగారం అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గతంలో ప్రైవేటుకు విక్రయించింది ప్రభుత్వం . రెండేళ్ల క్రితం ట్రైడెంట్ చక్కర పరిశ్రమ మూతపడింది. కార్మికులకు ఏడుకోట్ల వేతనాల బకాయిలు, రైతులకు, బ్యాంకు రుణం 25 కోట్ల బకాయిలు వున్నాయి. ఆర్ఆర్ యాక్టు వేలం వేస్తున్నట్లు తహసిల్దార్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో చెరుకు సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే జహీరాబాద్ ప్రాంతంలో సాగు భారీగా తగ్గింది.

## మహిళా రైతులకు 50 శాతం రాయితీ ఇవ్వండి

**మహిళలు భూ యాజమానులయ్యేలా ప్రొత్సహించండి**



**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):**

మహిళా రైతు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. సాగు భూమి రిజిస్ట్రేషన్ చార్జీలో మహిళా రైతులకు 50 శాతం రాయితీ ఇవ్వాలి. మహిళలు భూ యాజమానులయ్యేలా ప్రొత్సహించాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. భూమి అంటే ఆర్థిక వనరే కాదు సమాజంలో గౌరవం, అధికారం. భూమిపై మహిళలకు యాజమాన్య హక్కులు కల్పించేలా చర్యలు చేపడతాం. సాగు భూమి రిజిస్ట్రేషన్ చార్జీల్లో మహిళలకు 50 శాతం రాయితీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని సీతక్క అన్నారు.

## కిసాన్ మోర్చా ఆందోళన

**సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం**

**యాదాద్రి, జూలై 16 (ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. వివిధ సాకులు పెట్టి రైతులకు రుణమాఫీలో కొరివి పెడుతున్న ప్రభుత్వంను వెంటనే భర్త రఫ్ చేయాలని డిమాండ్చేసారు. రేషన్ కార్డు సాకుతో రుణమాఫీ చేయడం లేదని రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి అరోపించారు.

## పవన్ ఫోటోలు పెట్టినట్టే భట్టి ఫోటోలు కూడా పెట్టాల్సిందే...

**మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్**

**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):**

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫోటోతో పాటు సమానంగా దళిత ఉపముఖ్యమంత్రి అయిన భట్టి విక్రమార్క ఫోటోను అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేసారు.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లోసీఎంతో సమానంగా పవన్ కళ్యాణ్ ఫోటోలు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా మొత్కుపల్లి గుర్తు చేసారు. లంచాలు, పైరవీలు డబ్బుపై ఆశ లేకుండా నా హయాంలో పాలన చేశా. గత ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో నాకు పోటీ చేసే అవకాశం రాలేదదు. తెలంగాణలో నేను ఎక్కడ పోటీ చేసినా నాకు పది వేల ఓట్ల మేజారీటీ వస్తుంది. నాకు యాదగిరిగుట్టలో అర్ధ గజం భూమి లేదు... ఎలాంటి ఆస్తులు సంపాదించలేదు. సగెటప్.. ఎన్నికల్లో కోట్లకు విలువ ఉంది, ప్రజలకు సేవ చేసిన వాడికి విలువ లేదు. బడుగు బలహీన వర్గాల వారి తరఫున నేను ఎల్లప్పుడూ పోరాడుతానే ఉంటా"తన భవిష్యత్తు కార్యచరణ పోరాటమే తప్ప భవిష ఏమీలేదని మోత్కుపల్లివెల్లడించారు.

## రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**

**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):**



ఒట్టులు వేసి..దేవుళ్ళను కూడా సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని విమర్శలు గుప్పించారు. రుణమాఫీలో నిబంధనలు పేరిట రైతుల నోట్లో కాంగ్రెస్ ప్రభుత్వం మన్ను కొట్టిందన్నారు. పరిజ్ఞానం లేకుండా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు ఇచ్చిందన్నారు. రుణమాఫీ నియమనిబంధనలు రైతులకు ఉరి తాళ్ళుగా మారతాయన్నారు. రాజకీయ పార్టీలు, నేతలు ప్రజలను మోసం చేయాలని చూస్తారని గతంలో సీఎం రేవంత్ అన్నారని గుర్తుచేశారు. ప్రజల ఆలోచన పట్ల రేవంత్ రెడ్డికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కానీ.. అవమానాన్ని భరించరన్నారు.మోసగాళ్ళను, మాట ఇచ్చిన తప్పినవారిని అంతిమంగా ప్రజలు బొంద పెడతారని హెచ్చరించారు. అతి తక్కువ కాలంలో ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన సీఎం రేవంత్ రెడ్డి అని ఎంపీ విరుచుకుపడ్డారు. మరోసారి మోసగించబడ్డామని అన్ని వర్గాల ప్రజలు అంటున్నారన్నారు. ఐదేళ్ళు అధికారం ఇచ్చారని. ఇష్టం వచ్చినట్లు చేయొచ్చని రేవంత్ భావిస్తున్నారన్నారు. గతంలో విమర్శలు చేసినరేవంత్.. ఏడు నెలల నుంచి రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో చిత్తు కాగితంతో సమానమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఇతర పార్టీల ఎమ్మెల్యేల మీద ఉన్న ద్యాస.. ప్రజా సమస్యలపై లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే దమ్ము లేదని. పేదల ఇళ్ళు కూలగొట్టటమే పనిగా రేవంత్ రెడ్డి సర్కార్ పెట్టుకుందని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# 17 లక్ష సంవత్సరాల రామసేతు

**చెన్నై, జూలై 16 (ప్రజాస్వరం):**

భారత్ శ్రీలంక మధ్య రామసేతు వంతెన కాల్పనికం కాదని.. నిజంగానే ఉందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) నిర్ధారించింది. ఈమేరకు ఇస్రో శాస్త్రవేత్తలు అమెరికాకు చెందిన ఉపగ్రహం సహాయంతో తమిళనాడు వంతెనకు సంబంధించిన మ్యాప్ విడుదల చేశారు. భారత్ శ్రీలంక మధ్య ఉండే ఈ వంతెన పొడవు 29 కిలోమీటర్లు ఉంది. దీని ఎత్తు సముద్రగర్భం నుంచి 8 మీటర్లు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ వంతెన తమిళనాడులోని రామేశ్వరం ద్వీపం ఆగ్నేయ దిక్కులోని ధనుష్కోటి నుంచి శ్రీలంక వరకు ఉందని తెలిపారు. ద్వీపంలోని తలైమన్నార్ వాయవ్య దిశ వరకు విస్తరించి ఉందని పేర్కొన్నారు. దీనిని సున్నపురాతితో నిర్మించినట్లు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ సేతువు 99.98 శాతం నీటిలో మునిగిందని శాస్త్రవేత్తలు ప్రకటించారు. దేవుడు, రాముడు, రామాయణం వంటి అంశాలపై దేశంలో ఇప్పటికీ ఆస్తికులు, నాస్తికుల మధ్య చర్చ జరుగుతూనే ఉంది. ఇలాంటి అంశాలలో ఒకటి రామసేతు. ఇది స్వయంగా రాముడే నిర్మించాడని కొందరు చెబుతుంటే %ొ% కాదు సముద్రంలో సహజసిద్ధంగానే ఏర్పడిందని మరికొందరు వాదిస్తున్నారు. అయితే భారత్‌లో ఈ వంతెనను రామసేతు అని పిలుస్తుండగా, శ్రీలంకలో ఆదాంగ్ పాలం అని పిలుస్తారు. దీనినే ఆడమ్స్ బ్రిడ్జ్ అని కూడా అంటారు. దీని ఆధారంగానే గతంలో రామసేతు సినిమా తెరకెక్కించారు. ఇక రామసేతు వయసు 17 లక్షల ఏళ్ళు ఉంటుందని అంచనా. రావణుడు సీతను అపహరించడంతో ఆమెను రక్షించడానికి రాముడు లంకకు వెళ్లే క్రమంలో తన వానర సైన్యంతో కలిసి రాళ్లతో ఈ వంతెనను నిర్మించాడనేది చాలామంది విశ్వాసం. సుమారు 30 మైళ్ల పొడవైన ఈ వంతెన ఎలా నిర్మితమైంది అన్నది మాత్రం ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నే. అయితే దీనిపై తాజాగా ఇస్రో శాస్త్రవేత్తలు క్లారిటీ ఇచ్చారు. ఇది నిర్మించినదే అని తేల్చారు. సహజ సిద్ధంగా ఏర్పడలేదని ప్రకటించారు.ఇదిలా ఉంటే వంతెన కోసం వాడిన రాళ్ల రహస్యంపనా అనేక పరిశోధనలు జరిగాయి. పగడపు, సిలికా రాళ్లు వేడెక్కినపుడు వాటిలోకి గాలి చేరి అవి తేలికగా మారి నీటిపై తేలుతాయని, అలాంటి రాళ్లతోనే ఈ వారధి నిర్మించారని కొందరు పేర్కొంటున్నారు. సహజంగానే ఏర్పడి ఉండొచ్చనేది కొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇక ఈవంతెన ప్రాంతంలో సముద్రంలో



ఆటుపోట్లు అత్యంత తీవ్రంగా ఉంటాయి. ఇక 2004 వచ్చిన సునామీని కూడా రామసేతు తట్టుకుని నిలబడింది. అయితే కొన్ని రాళ్లు రామేశ్వరం ప్రాంతంలో కనిపించాయట. ఇప్పటికీ ఆ ప్రాంతంలో నీటిపై తేలే రాళ్లు కనిపిస్తాయి. వాటిని చూడటానికి చాలా మంది రామేశ్వరం వెళతుంటారు.ఇదిలా ఉంటే.. రామసేతు నిర్మాణంపై అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా క ఊడా పరిశోధనలు చేసింది. శాటిలైట్ల ద్వారా తీసిన ఛాయాచిత్రాల్లో 30 మైళ్ల పొడవున రాళ్లు పేర్చి ఉన్నట్లుగా కనిపిస్తుందని ప్రకటించింది. ఇది మానవ నిర్మితం అని మాత్రం నాసా ఎప్పుడూ ధ్రువీకరించలేదు. ఇక 2017 డిసెంబర్‌లో అమెరికాకు చెందిన సైన్స్ ఛానెల్%ొ% 30 మైళ్లకు పైగా పొడవున్న రామసేతు మానవ నిర్మితమని ప్రకటించడం ద్వారా మరోసారి చర్చకు తెరలేపింది. ఇక రామసేతు సహజ సిద్ధంగా ఏర్పడినట్లు లేదని, అక్కడి ఇసుక సహజంగా ఉన్నదే అయినా దానిపై పేర్చిన రాళ్లు మాత్రం వేరే చోటు నుంచి తీసుకొచ్చి పేర్చినట్టుగా ఉన్నాయని పురాతత్వ శాఖకు చెందిన డాక్టర్ అలెన్ లెస్టర్ తెలిపారు. ఈ ఇసుక 4వేల ఏళ్ల నాటిదని, రాళ్లు 7 వేల ఏళ్ల నాటివని పరిశోధనలో తేలిందని చెప్పారు.ఇదిలా ఉంటే.. రామసేతు రాజకీయంగా కూడా కొన్నేళ్లు బాగా రగిలిన అంశమే. 2005లో యూపీఏ ప్రభుత్వం సేతు సముద్రం షిప్ కెనాల్ ప్రాజెక్టులో భాగంగా 12 మీటర్లలోతు, 300 మీటర్ల వెడల్పు ఉన్న కాలువను తవ్వేందుకు అనుమతి ఇచ్చింది. గల్ఫ్ ఆఫ్ మున్నార్‌ను లోతుగా తవ్వి నౌకల రాకపోకలు సాగించేలా మార్చాలని గతంలో యూపీఏ సర్కారు భావించింది. ఈ ప్రాజెక్టు ద్వారా అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య ప్రయాణించడానికి ఓ మార్గం ఏర్పడుతుంది. ప్రాజెక్టు పూర్తయితే శ్రీలంక చట్టూ తిరిగే అవసరం ఉండదు. ప్రయాణ సమయం, ధనం రెండూ ఆదా అవుతాయని అంచనా వేశారు. అయితే ఈ మార్గం ఏర్పడాలంటే రామసేతును బద్ధలు కొట్టాల్సి వస్తుండడంతో హిందూ సంస్థలు ఈ ప్రాజెక్టును వ్యతిరేకించాయి. భారత్, శ్రీలంకకు చెందిన పర్యావరణ వేత్తలు ఈ ప్రాజెక్టు చేపడితే సముద్ర పర్యావరణం దెబ్బ తింటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# టీచర్ల కోసం వేడుకోలు..

**ఏలూరు, జూలై 16 (ప్రజాస్వరం):**



రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాల కోసం తాము మట్టితో షెడ్‌ను నిర్మించుకున్నామని, ఉపాధ్యాయుడిని పంపాలని గిరిజన గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వ స్పందన కోసం ఆ గిరిజన గ్రామం ఎదురు చూస్తోంది.అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కివర్ల పంచాయతీ తెంగల్ బంధ గ్రామంలో 28 కుటుంబాలు ఉన్నాయి. ఆ గ్రామంలో మొత్తం 136 మంది జనాభా ఉన్నారు. వీరంతా కొండదొర ఆదివాసీ గిరిజనలు, వీరు కొండ చిట్టచివర జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామంలో పిల్లలు చదువుకోవడానికి పాఠశాల లేదు. తెంగల్ బంధ గ్రామానికి చెందిన 26 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా గంగవరం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో చదువుతున్నారు. అయితే రెండు వాగులు దాటుకొని, స్కూల్‌కి వెళ్లి రావాల్సి వస్తుంది. దాదాపు నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ స్కూల్‌కి వెళ్లి రావాల్సి ఉంటుంది. అయితే రెండు వాగులు దాటాల్సి రావడంతో వర్షాకాలంతో వాగులు పొంగిపొర్లుతాయి. వేగవంతంగా ప్రవహించే వాగులను చిన్నారులు దాటాల్సి వస్తుంది. ఒక్కొసారి నీటి ఉధృతికి వాగుకు వైపు పిల్లలు, మరోవైపు తల్లిదండ్రులు గంటల తరబడి ఉండిపోవాల్సి వస్తోంది.ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వాగుల ప్రవాహం పెరిగింది. దీంతో ఆ వాగులను విద్యార్థులు దాటలేక విద్యకు దూరం అవుతున్నారు. వారి పిల్లల బాధలను చూసి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. దీంతో ఈ సమస్య ఆ నోటా, ఈ నోటా వ్యాప్తి చెంది మీడియా కథనాలతో అధికారుల స్పందించాల్సి వచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అనంతగిరి ఎంఈఓ తెంగల్ గ్రామాన్ని సందర్శించారు. అప్పుడు మీరు పాఠశాల కోసం రేకుల షెడ్ నిర్మిస్తే టీచర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని గ్రామస్థులతో ఎంఈఓ అన్నారు.దీంతో గ్రామంలో ఉన్న ప్రజలంతా సమావేశం అయ్యారు. ఎలాగైనా పిల్లల భవిష్యత్తు కోసం పాఠశాలను నిర్మించుకోవాలని, అది కూడా వారం రోజుల్లోనే నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నారు. అలాగే గ్రామంలోని ప్రతి ఒక్క కుటుంబం రూ. 500 చొప్పున చందాలు పోగేశారు. సొంత పనులు, పొలం పనులు మానుకొని గ్రామస్థులంతా రేకులతో షెడ్‌ను నిర్మించారు. షెడ్‌కు చుట్టు మట్టిగోడలు కట్టారు. దీనికోసం గ్రామంలోని మహిలలు, పురుషులు, చిన్నా పెద్ద అందరూ కష్టపడ్డారు.రేకులు షెడ్ పాఠశాల నిర్మించుకున్నామని, తమకు ఉపాధ్యాయుడిని పంపాలని తెంగల్ బంధ గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు పాండవుల సత్యారావు, గ్రామస్థులు వినతి పత్రం కూడా సమర్పించారు. ఉపాధ్యాయుడిని ఏర్పాటుకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆదివాసీ గిరిజనలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి టీచర్‌ను నియమించాలని జిల్లా కలెక్టర్‌కు, ప్రాజెక్ట్ అధికారి (పీఓ)కి ఆదివాసీ గిరిజన పిల్లలు, పెద్దలు చేతులు జోడించి వేడుకుంటున్నారు.

# ఆమెకు ఉచితం... అతడికి భారం

**బెంగళూరు, జూలై 16 (ప్రజాస్వరం):**

ఉచితం.. ఈ పదం వినగానే భారతీయ పేద, మధ్య తరగతి జనాలకు ఎక్కడలేని ఉత్సహం వస్తుంది. ఫ్రీగా వస్తుందంటే అది మనకు అవసరమా.. కాదా అనే విషయం కూడా ఆలోచించరు. చితంగా వస్తుంది కాబట్టి తీసుకుందాం అని ఆలోచించేవారే ఎక్కువ. ఇక నేడు ఉచితం అయితే.. రేపటి పరిస్థితి ఏంటి అన్న ఆలోచన కూడా చేయరు. దీంతో ఎన్నికల వేళ.. అధికారం కోసం ఉచితంగా హామీలు ఇచ్చేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడానికి తంటాలు పడుతున్నారు. ఇందుకు తాజాగా కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉదాహరణగా నిలిచింది.ఐదు గ్యారంటీల పేరుతో కర్ణాటకలో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఉచిత హామీలకు ఆశపడి కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌ను గద్దెనెక్కించారు. అధికారంలోకి రాగానే ఉచిత హామీలు అమలు చేయడం ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే.. ఉచితాల కారణంగా ప్రభుత్వంపై భారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో దానిని తగ్గించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చార్జీలు పెంపుపై దృష్టిపెట్టింది. జూన్‌లో పెట్రోల్, డీజిల్‌పై పన్ను 4 శాతం పెంచింది. తాజాగా త్వరలో ఆర్టీసీ చార్జీలు పెంచేందుకు సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని కర్ణాటక రోడ్డు రవాణా సంస్థ(కేఎస్‌ఆర్టీసీ) చైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ తెలిపారు.కర్ణాకలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నారు. ఈ పథకంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ భారీగా పెరిగింది. అయితే సంస్థకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. దీంతో ఏడాది తిరిగే సరికి సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో నిధులు సమీకరణపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా ధరలు పెంచనిదే.. బస్సులు నడపలేమని చైర్మన్ శ్రీనివాస్ తెలిపారు. చార్జీల పెంపు కూడా 15 నుంచి 20 శాతం ఉండాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. సీఎం సిద్ధరామయ్య తీసుకునే నిర్ణయంపై చార్జీలు ఏమేరకు పెరుగుతాయనేది ఆధారపడి ఉంటుందని వెల్లడించారు. అయితే చార్జీల పెంపు మాత్రం తప్పదని మరోసారి స్పష్టం చేశారు.ఇక కర్నాటక ఆర్టీసీ చైర్మన్ ఈ పెంపునకు కొత్త కారణం చెప్పారు. రాష్ట్రంలో 2019 నుంచి బస్ చార్జీలు పెంచలేదని తెలిపారు. ఇక ఉద్యోగుల వేతనాలు కూడా పెంచలేదని వెల్లడించారు. 2020 నుంచి ఉద్యోగులు వేతనాలు పెంచాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే చార్జీలు పెంచాల్సి వస్తోందని తెలిపారు. గడిచిన మూడు నెలల్లో సంస్థక రూ.295 కోట్ల నష్టం వచ్చిందని వెల్లడించారు.కర్నాటక ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కారణంగానే లాభాల్లో ఉన్న రోడ్డు రవాణా సంస్థ నష్టాల్లో కూరుకుపోతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు ఉచిత ప్రయాణం ఎత్తివేస్తే తీవ్ర విమర్శలు వ్యక్తమవుతాయి. ఈ నేపథ్యంలో ఉచితాన్ని కొనసాగిస్తూనే ఆదాయం సమకూర్చుకునేందుకు చార్జీలను భారీగా పెంచాలని ఆ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదన చేసింది. అంటే.. మహిళల ఉచిత ప్రయాణ భారాన్ని కూడా పురుషులే మోయాల్సిన పరిస్థితి నెలకొంది.. ఐదు గ్యారెంటీల పేరుతో కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. గ్యారంటీలను అమలు చేస్తూ.. వాటితో జరిగే నష్టాన్ని పూడ్చుకునేందుకు ప్రజలపై పన్నుల భారం మోపుతోంది. వివిధ రకాల పన్నులు, ఇతరత్రా రూపాల్లో సామాన్యుడి జేబును గుల్ల చేస్తోంది. ఇప్పటికే గైడెన్స్ వ్యాల్యూ ట్యాక్స్, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, రవాణా వాహనాలపై అదనపు సెస్, ఈవీలపై లైఫ్ టైమ్ ట్యాక్స్ పెంచింది. గత నెలలో పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్‌ను దాదాపు 4 శాతం చొప్పున పెంచింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.3, లీటర్ డీజిల్ ధర రూ.3.02 మేర పెరిగింది. మరోవైపు పాల ధరలను కూడా లీటర్, అర లీటర్ ప్యాకెట్లపై రూ.2 చొప్పున కర్ణాటక మిల్క్ ఫెడరేషన్(కేఎంఎఫ్) పెంచింది. ఇక ఇప్పుడు ఆర్టీసీ చార్జీలపై పడింది.ఒకవైపు ధరలు భారీగా పెంచుతున్న కాంగ్రెస్ సర్కార్.. ఇంకోవైపు అమలు చేస్తున్న గ్యారంటీలకు కత్తెర పెట్టే పనిలో పడింది. ఆంక్షలు, కోతలతో గ్యారంటీలను కుదించేస్తోంది. ఫ్రీ కరెంటు అని ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెరతీశారు. మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించారని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు తెచ్చారని, నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమన్న 'అన్నభాగ్య' ఇలా ప్రతీ స్కీమ్‌లోనూ కోతలు విధిస్తున్నారు.తెలంగాణలో కూడా ఆరు నెలల క్రితం ఆరు గ్యారంటీలు, ఉచిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే ధరలను భారీగా పెంచిన అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్నే.. త్వరలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిచే అవకాశాలు ఉన్నాయి. ఎందుకంటే.. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు ఇస్తే.. అదే బాటలో తెలంగాణలో ఆరు గ్యారంటీలతో అధికారం చేపట్టింది. హామీల విషయంలో కర్ణాటక కాంగ్రెస్‌ను అనుసరించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రజలపైపన్నుల భారం మోపడంలోనూ ఆ రాష్ట్ర ప్రభుత్వానే అనుసరిస్తుందంటున్నారు నిపుణులు.ఇక కర్ణాటకాలో ఆర్టీసీ చార్జీల పెంపుతో ప్రజలకు ఉచితాలపై ఉన్న భ్రమలను ఒక్క ట్వీట్‌తో పటాపంచలు చేశారు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. 'ఉచితాలకు మోసపోతే రేపు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు, దీనికి ఉదాహరణగా కర్నాటకలో ఆర్టీసీ బస్ చార్జీల పెంపు' అని ట్వీట్ చేశారు. కర్నాటకలో ఉచిత ప్రయాణాల కారణంగా ప్రభుత్వంపై ఏటా రూ.295 కోట్ల భారం పడుతోందన్నారు. దానిని తగ్గించుకోవడానికి కొత్త ఎత్తుగడ వేసిందని తెలిపారు. అందులో భాగంగానే చార్జీలు పెంచుతోందని పేర్కొన్నారు. మహిళల ఉచిత ప్రయాణానికి పురుషులపై వడ్డింపు అన్నమాట అని తెలిపారు.

# మాజీ సైనికుడి దారుణ హత్య

**విశాఖపట్నం, జూలై 16 (ప్రజాస్వరం):**

విశాఖలో దారుణం చోటు చేసుకుం ది. గాజువాక జగ్గు జంక్షన్ సమీపం లోని శ్రీకృష్ణ నగర్ వద్ద వికలాంగుడు అయినా మాజీ సైనికుడు దారుణ హత్యకు గురయ్యాడు. వేటాడి వెం టాడి మరి అతి దారుణంగా కత్తుల తో నరికి చంపేశారు. మృతి చెందిన వ్యక్తి మాజీ సైనికుడు అప్పలనాయుడుగా గుర్తించారు పోలీసులు. స్థల వివాదంలో తరచూ గొడవలు జరుగుతుండడంతో హత్యకు స్కెచ్ వేసి ప్లాన్ ప్రకారం దుండగులు హత్య చేశారు. హత్య చేసిన అనంత రం పోలీసులకు లొంగిపోయారు. హత్య చేయించారా లేదంటే చేశారా అన్న విషయాలు తెలియాల్సి ఉం ది. ఈ హత్యా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

# టీటీడీ మఠాల భూములను పెద్దిరెడ్డే ఆక్రమించాడు

## మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి

**అమరావతి, జూలై 16 (ప్రజాస్వరం):**

గత ఐదేళ్లలో వైసిపి నేతలు భారీ భూదోపిడీకి పాల్పడ్డారని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో భూదోపిడీలో వైసిపి మంత్రులు, ఎంఎల్‌ఎలు కీలక పాత్ర పోషించారని, వైసిపి మాజీ ఎంఎల్‌ఎలు పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి చిత్తూరు జిల్లాల్లోనే మూడ వేల ఎకరాలు దోచుకున్నారని ఆరోపణలు చేశారు. టిటిడి మఠాల భూములను పెద్దిరెడ్డి కుటుంబం వదల్లేదని, చట్టపరంగా విచారణ జరిపి త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామన స్పష్టం చేశారు. ఇప్పటికే రెవెన్యూ, దేవాదాయ అధికారులు విచారణ ముమ్మరం చేశారని, ఎపిలో ఉన్న గ్రానైట్ కొండలన్నీ పెద్దిరెడ్డే హస్తగతం చేసుకున్నారని, తమ భూములు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదు చేసే కాపాడుతామని ఆయన స్పష్టం చేశారు. భూములు, ఇసుక, మైనింగ్ దోపిడీకి పాల్పడిన వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. మైనింగ్ శాఖలో అవినీతిపై ఇప్పటికే విచారణ జరుగుతోందన్నారు.ఆర్‌టిసి నుంచి ఎలక్ట్రిక బస్సులు నడిపేందుకు సంస్థలతో చర్చిస్తున్నామని, గత ఐదేళ్లలో ఆర్‌టిసిని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని రామ్ ప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రాగానే 200 వరకు కొత్త బస్సులు రోడ్డెక్కాయని, మరో 1200 కొత్త బస్సులు రోడ్డెక్కనున్నాయని వివరించారు.

# ఇండియాలోనే ఆత్మహత్యలు అధికం

**న్యూ ఢిల్లీ, జూలై 16 (ప్రజాస్వరం):**

కాలం మారింది. మనుషులు కూడా చేంజ్ అయ్యారు. ఒకప్పటిలా పరిస్థితులు లేవు. పని అంత కన్నా లేదు. ఆర్థిక సమస్యలు ఎక్కువే. భార్య భర్తల మధ్య సంబంధాలు కూడా బాగో లేవు. ఆరోగ్యం గురించి చెప్పక్కర్లేదు. పై నాలుగు కారణాల వల్ల కొందరు ఆత్మహత్యే శరణ్యం అంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆత్మహత్యలకు సంబంధించిన డేటాను నేషనల్ క్రైమ్ బ్యూరో విడుదల చేసింది. డేటాలో భారతదేశంలో అత్యధిక మంది ఆత్మహత్య చేసుకున్నారనే కఠోర నిజం. చిన్న పెద్ద అనే తేడా లేదు. అనారోగ్య సమస్య వచ్చిందా..? చాలు అంతే.. కొందరు కఠినమైన నిర్ణయం తీసుకునేందుకు వెనకాడటం లేదు. 2022లో ప్రపంచవ్యాప్తంగా 1.71 లక్షల మంది చనిపోయారు. భారతదేశం నుంచి అత్యధికంగా మంది ఉన్నారు. దేశంలో లక్ష మందికి 12.4 నలుగురు చొప్పున చనిపోయారనే కఠోర సత్యం తెలిసింది. డిప్రెషన్ వల్ల కొందరు క్షణికావేశంలో చనిపోవాలనే నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిసింది. కొందరిలో జన్యుపరంగా ఇలా వస్తోండగా.. మరికొందరు ఒత్తిడితో నిర్ణయం తీసుకుంటున్నారని తెలిసింది. డిప్రెషన్తోనే..!! 'ఆత్మహత్య చేసుకునేందుకు సాధారణ కారణం డిప్రెషన్, ఒత్తిడి వల్లే కఠినమైన నిర్ణయం తీసుకోవడానికి ఏ మాత్రంఅలోచించడం లేదు. పని ఒత్తిది, ఆర్థిక సమస్యలు, భార్య భర్తల మధ్య అన్యోన్యత లోపించడం, ఆరోగ్య సమస్యల వల్ల సూసైడ్ చేసుకుంటున్నారు అని' సర్ గంగారం ఆస్పత్రిలో సైకియాట్రీ వైద్యులు రాజీవ్ మెహతా చెబుతున్నారు. పై నాలుగు సమస్యల వల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఆందోళననిరాశగా రూపాంతరం చెందుతుంది. క్రమంగా ఆత్మహత్యకు దారితీస్తుందని వివరించారు. సూసైడ్ చేసుకునే వారిలో 50 నుంచి 90 శాతం మంది ఒత్తిడి, డిప్రెషన్, బైపోలార్ డిజార్డర్ వంటి మానసిక వ్యాధులతో బాధ పడుతున్నారని పలు అధ్యయనాలు నివేదిస్తున్నాయి.

# శ్రీరంగం నుంచి తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పణ

**తిరుమల, జూలై 16 (ప్రజాస్వరం):**

ఆణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం శ్రీ రంగనాథస్వామి తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం ఉదయం శ్రీ బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కన గల తిరుమల పెద్ద జీయర్‌స్వామి మఠంలో శ్రీవారి సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుండి తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు, తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి జెఇఒ వీరబ్రహ్మం కలిసి పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా నాలుగు మాడ వీధుల ప్రదక్షిణగా ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్, శ్రీరంగం ఆలయ ఆలయ జాయింట్ కమిషనర్ మారియప్పన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేల హక్కులను కాపాడండి

**హైదరాబాద్, జూలై 16 (ప్రజాస్వరం):**

అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కూడా ఓడిపోయిన వారికి మద్దతుగా నిలుస్తున్నారని, ఇదేనా ప్రజాపాలన అంటే కాంగ్రెస్ చెప్పాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎ సబితా ఇంద్రారెడ్డి నిలదీశారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కలిశారు. ఈ సందర్భంగా సబితా మాట్లాడారు. ప్రొటోకాల్ విషయంలో ఉల్లంఘనలను స్పీకర్ గడ్డ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. గత ఆరు నెలల నుంచి ప్రతి నియోజకవర్గంలో ఓడిపోయిన ఎంఎల్ఎలకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఓడిపోయిన అభ్యర్థులు పాల్గొనడం ఏంటని ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. ఎంఎల్ఎల హక్కులను కాపాడాలని స్పీకర్‌ను కోరామని, ఎంఎల్ఎలకు ఉన్న హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందన్నారు.ప్రభుత్వ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ ఎంఎల్ఎ సునీతా లక్ష్మారెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను ప్రత్యేక అతిథులుగా పిలుచుకొని ప్రభుత్వ కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందని లక్ష్మారెడ్డి తెలియజేశారు.

# ఏజన్సీలో క్షుద్ర పూజల కలకలం

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 16 (ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం దిబ్బగూడెం ఏజన్సీ గ్రామంలో క్షుద్రపూజల కలకలం తో గ్రామస్తులు భయాందోళనలో వున్నారు. గ్రామంలో ఓ పామాయిల్ తోట పక్కన పెద్ద గోతిలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండటంతో గ్రామస్తులు ఒంటరిగా బయటకి వెళ్ళడానికి కూడా భయపడుతున్నారు. ఏజన్సీ ప్రాంతంలో మూఢనమ్మకాలతో ఇలాంటి పూజలు జరుగుతూనే ఉండటం సహజమే కానీ ఈ సారి భూ తగాధాల నేపథ్యంలో ప్రత్యర్థుల కోసమే ఈ క్షద్రపూజలు చేసారన్న వార్త ఊరంతా గుప్పుమనడంతో మూడొందల మంది ఉన్న గ్రామం వణికిపోతోంది. రాత్రిపూట అత్యవసర సమయాల్లో కూడా బయటికి రావడానికి వెనకడుగు వేస్తున్నారు. ఇదంతా మూఢనమ్మకం అంటూ గ్రామంలో చదువుకున్న యువత ఎంత చెప్పినా కూడా గ్రామస్తులు పెడచెవిన పెడుతున్నారు.దీనిపై యంత్రాంగం వెంటనే దృష్టి పెట్టి ఇటువంటి మూఢనమ్మకాల పూజలు చేసే వారిపై చర్యలు తీసుకుని, మూఢనమ్మకాలపై అపోహలు పోయేలా కళాజాత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని గ్రామంలోని యువత కోరుకుంటున్నారు.

# ప్రోటోకాల్ రగడ

**రంగారెడ్డి, జూలై 16 (ప్రజాస్వరం):**

రంగారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన బోనాలకు సంబంధించి దేవాలయాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ రగడ తీవ్ర స్థాయికి దారి తీసింది. అధికారుల తీరుకు నిరసనగా వేదిక కింద కూర్చుని స్థానిక ఎమ్మెల్యే మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నిరసన తెలిపారు. గతంలో ఎప్పుడు లేని విధంగా లబ్ధిదారులు మాత్రమే లోపలికి పోలీసులు అనుమతిస్తారని చెప్పడం పై ఎమ్మెల్యే సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ లేని వ్యక్తులను వేదిక పైకి ఆహ్వానించవద్దని, అలా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ స్థానిక బీఆరెస్ నాయకులతో కలసి కార్యక్రమం వద్దనే బైటాయించారు. ఒకపక్క బీఆర్ఎస్ ఆందోళన లు కొనసాగిస్తుండగా... మరో పక్కా దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పలు ఆలయ కమిటీలకు బోనాల పండుగ ఉత్సవాల ఏర్పాట్లకు సంబందించిన చెక్కులను పంపిణి చేయడం జరిగింది. దేవాలయం ప్రాంగణం మొత్తం ఒక పార్టీ పై ఒక పార్టీ విమర్శలు చేసుకుంటూ ఆందోళనలు నిర్వహించడం జరిగింది. ఎలాంటి అవాంఛనియ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత ను ఏర్పాటు చేయడం జరిగింది.

# నేతలంతా గప్చిప్.. ఏం జరగనుందో?

## ఆ నేతల సైలెంట్ వెనుక అసలు రహస్యం అదేనా..?

**అమరావతి, జూలై 16 (ప్రజాస్వరం):**

వైసీపీ అధికారంలో ఉన్న ఐవేళ్లూ.. కొందరు నేతల నోళ్లకు ఐదూ విశ్రాంతి లేకుండా పోయింది. ప్రతిరోజూ మీడియాలో కనిపిస్తూ అప్పటి విపక్ష నేతలపై నిత్యం అభ్యంతరకర పదాలతో విరుచుకుపడేవారు. రాజకీయ పార్టీల నాయకులు విమర్శలు చేసుకోవడం సర్వసాధారణం.. ఓ పార్టీ విమర్శలకు మరో పార్టీ కౌంటర్ ఇవ్వడం దేశ వ్యాప్తంగా చూస్తుంటాం. కానీ ఏపీలో మాత్రం 2019 నుంచి 2024 మధ్య వైసీపీ నేతలు రాజకీయ విమర్శలను పక్కనపెట్టి.. విపక్ష నేతలను వ్యక్తిగతంగా ఆంధ్ర టార్గెట్ చేస్తూ.. తిట్లతో విరుచుకుపడేవారు. సరిగ్గా ఐదేళ్ల తర్వాత పరిస్థితులు పూర్తిగా మారాయి. ప్రజలు కోరుకుంటున్నది తిట్లవినిపించని బడా నేతల స్వరం..పురాణం కాదని.. అభివృద్ధి, సంక్షేమమని వైసీపీ నేతలకు తెలిసొచ్చేలా ప్రజలు ఎన్నికల్లో తీర్పునిచ్చారు. తమకు నచ్చని వ్యక్తులను, నాయకులను లక్ష్యంగా చేసుకుని తిట్టడానికి మిమల్ని చట్టసభలకు పంపలేదని.. ప్రజల భవిష్యత్తును బాగుచేయడానికి పంపితే.. మీరు సర్వనాశనం చేశారని తెలిసేలా ఏపీ ఓటర్లు తీర్పు చెప్పారు. వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా దక్కలేదు. తాము భారీ మెజార్టీతో గెలుస్తామని విర్రవీగిన నేతలు పరాజయం పాలయ్యారు. విపక్షాలపై తిట్లతో విరుచుకుపడ్డ నాయకులను ప్రజలు ఎన్నికల్లో ఓడించారు. అదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు పనిచేసినట్లు భవిష్యత్తులో ఎవరూ పనిచేయవద్దని.. ఆచితూచి వ్యవహరించాలని ఓ సందేశాన్నిచ్చారు ఏపీ ప్రజలు. విపీలో ఎన్నికల తర్వాత వైసీపీలో కొందరు నేతలు సైలెంట్ అయిపోయారట, ప్రధానంగా మాజీ మంత్రులు ఆర్కే రోజా, విడుదల రజిని, కొడాలి నాని, గుడివాడ అమర్ నాథ్, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఎన్నికల ముందునిత్యం విరీడియాలో కనిపిస్తూ.. చంద్రబాబు, జగన్ సహా ఆపార్టీ నేతలను టార్గెట్ చేస్తూ విమర్శలు చేసేవారు. అవతలి నుంచి ప్రభుత్వ పనివిధానంపై ఏదైనా అభ్యంతరం తెలియజేస్తే.. విషయంపై మాట్లాడకుండా.. వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ.. రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నంచేవారు. ఎన్నికల తర్వాత ఆ నాయకుల స్వరం వినిపించడం లేదు. ఐదేళ్లపాటు ప్రతిరోజూ ముందుకువచ్చి రోజుల కాలంలో పెద్దగా మీడియాలో కనిపించడం లేదు. క్రమంగా బలహీనవడుతుండటంతో.. నోరు మెదిపితే తమకు రాజకీయంగా ఇబ్బందులు తప్పవనే ఆలోచనతోనే కొందరు వైసీపీ నేతలు సైలెంట్ అయిపోయినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ప్రజలు తమను ఎమ్మెల్యేలుగా తిరస్కరం చదంతోనే నాయకులంతా సైలెంట్ అయిపోయారనే ప్రచారం సైతం జరుగుతోంది. కొందరు వేతలు నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారట... మరికొందరైతే మాట్లాదేవ్యక్తులు గత నెలపూర్తిగా వైసీపీ హైకమాందకు టర్లోనే లేరట, నియోజకవర్గంలో కనిపించని నేతల్లో కొందరు హైదరాబాద్కు జంప్ అయితే.. మరికొందరు చెన్నైకు వెళ్లిపోయారట. ఇంకొందరు విదేశాలకు పారిపోయారనే టాక్ వినిపిస్తోంది. వైసీపీ నాయకుల స్వరం తగ్గడానికి కారణాలు ఏమిటి.. ఆ పార్టీ వ్యూహం పనిచేస్తుందా అనేది తేలాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

# తిరుమల ప్రక్షాళన అయ్యేనా

**తిరుమల, జూలై 16 (ప్రజాస్వరం):**

తిరుమల.. కలియుగ వైకుంఠం. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచమంతా భక్తులున్న దివ్యక్షేత్రం. శ్రీనివాసుడు ఆపద మొక్కులవాడు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం. అందుకే ఆ కలియుగ దైవం దర్శనం కోసం .. ఎక్కడెక్కడి నుంచో సామాన్య భక్తులు వ్యవయప్రయాసలకు ఓర్చి ఏడు కొండలెక్కి వసతులున్నా లేకున్నా రోడ్లపై పడిగాపులు కాస్తారు. కంపార్ట్‌మెంట్లలో గంటలకు గంటలు ఎదురు చూస్తారు. కిక్కిరిసిన క్యూలైన్లలో తోసుకుంటూ.. ఆనందనిలయం ముందు దివ్యదర్శనానికి అడుగుపెడతారు. అరసెకనులో గర్భగుడి బయట క్యూలైన్లలో ఉన్న సామాన్య భక్తులను సిబ్బంది లాగి అవతల పడేస్తుంటే.. అరసెకను ఆ వేంకటేశ్వరుడి దివ్య దర్శనం చేసుకుని అరమోడ్పు కన్నులతో ఆలయం బయటకు చేరతారు. ఇది తిరుమల క్షేత్ర దర్శనం అనగానే మనకు గుర్తుకొచ్చేవి. తిరుపతిలో అడుగు పెట్టింది మొదలు.. మళ్లీ తిరుమలలో దర్శనం ముగించుకుని కొండ దిగే వరకు సామాన్య భక్తులకు ఎన్నో అవస్థలు.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలక మండళ్లు మారుతున్నా నిత్యం భక్తుడికి ఆ వెంకన్న దర్శనం అంటే కేవలం దైవదర్శనం మాత్రమే కాదు. సమస్యలను ముందు దర్శించి వాటిని అధిగమించి ఆ తర్వాతగానీ శ్రీనివాసుడిని దర్శించుకోవడం సాధ్యం కాదు. భార్యాభర్తలు, పిల్లపాపలు, వృద్ధులు ఇలా కుటుంబాలతో కలిసి శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తుంటారు సామాన్య భక్తులు. కొండపైకి రాగానే వాళ్లకు ముందు వసతి పెద్ద సమస్యగా మారుతుంటుంది. కాటేజీలున్నా.. భక్తుల రద్దీకి తగినంత ఉండవు. రోజురోజుకీ తిరుమలకు వచ్చే భక్తులు పెరుగుతూనే ఉన్నారు. కానీ.. కొండపై ఆ రద్దీని తట్టుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించడం పెను సవాలే. వీఐపీ భక్తులకు ప్రత్యేకమైన కాటేజ్‌లు, వసతులున్నాయి. బ్రేక్ , స్పెషల్ పేరుతో రెండు మూడు గంటల్లోనే వెంకన్న దర్శనం పూర్తవుతుంది. సామాన్య భక్తులకు వసతి సముదాయాలు అంతంత మాత్రమే. కొండపై వీఐపీలకే ప్రాధాన్యమిస్తున్నారని వారి సేవలోనే టీటీడీ తరిస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నా టీటీడీ మాత్రం ఉన్న కాటేజీలతోనే సర్దుబాటు చేస్తోందని.. సామాన్య భక్తులకు కొత్త కాటేజీలు, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. వారాంతాలు, పర్వదినాలు, సెలవులు, బ్రహ్మోత్సవాలు.. ఇలాంటి సమయాల్లో తిరుమలకు రద్దీ విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. అప్పుడు భక్తులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. ఓవైపు తమ ఇలవేల్పు, నమ్మిన దైవమైన వేంకటేశ్వరుడిని దర్శించుకోవాలి. అంతకు ముందు కొండపై



క్యూలైన్లలో సమస్యలతో సావాసం చేసి ముందుకు సాగాలి. రద్దీ సమయాల్లో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోతాయి. వెలుపలకు కిలోమీటర్ల క్యూలైన్లు కనిపిస్తాయి. చిన్నపిల్లలతో వచ్చినవాళ్లు, వృద్ధులు ఆ క్యూలైన్లు, కంపార్టమెంట్లలో ముందుకు నడవడమంటే కత్తిమీద సామే.

అలాంటి వారికి ప్రత్యేక వసతులు కల్పించి వీలైనంత త్వరగా దర్శనం పూర్తి చేయించాల్సిన అవసరముందనేది భక్తుల నుంచి వస్తున్న విన్నపం. కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం గంటల తరబడి వేచి చూడాలి. అక్కడ పలు ప్రాంతాలకు చెందిన భక్తులుంటారు. పెరుగన్నం, పులిహోర, సాంబార్ రైస్ ఇలా ప్రసాదాలను కంపార్ట్‌మెంట్లలో భక్తుల ఆకలి తీర్చేందుకు టీటీడీ అందిస్తుంటుంది. వీటి నాణ్యత విషయంలో భక్తుల నుంచి రకరకాల కంప్లైంట్స్ అందుతున్నాయి. నిత్య అన్నదాన సత్రంలో అన్నప్రసాదం క్వాలిటీపైనా రకరకాల విమర్శలున్నాయి. దర్శనానంతరం శ్రీవారి దివ్యప్రసాదంగా లడ్డూను భక్తులకు అందిస్తారు. వీటి తయారీ, నాణ్యత, లడ్డూ సైజ్‌పై కూడా ఫిర్యాదులు ఈమధ్యకాలంలో పెరిగాయి. ఒకప్పుడు లడ్డూ వారం రోజులు నిల్వ ఉన్నా ఎలాంటి దుర్వాసన వచ్చేది కాదు. కానీ.. అందులో వాడే సరుకుల క్వాలిటీలోపం కారణంగా రెండ్రోజులకే లడ్డూ ప్రసాదం చెడుపోతోందన్న కంప్లైంట్స్ వ్యక్తమవుతున్నాయి. వీటిపైనా ప్రత్యేకమైన దృష్టి పెట్టాలనేది భక్తుల ఆవేదన. ప్రక్షాళన తిరుమల నుంచే మొదలు పెడతామని ఏపీ సీఎం చంద్రబాబు శ్రీవారి దర్శనార్థం కొండకు వచ్చిన సందర్భంగా స్పష్టం చేశారు. భక్తులు ఎదుర్కొనే సమస్యలు ఒకవైపు ఉంటే.. గత పాలకమండలిపై విమర్శలు, అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. ముందుగా టీటీడీ పాలకమండలి ఈవోను మార్చి కొత్త ఈవోగా శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఏయే వ్యవస్థల్లో లోపాలున్నాయో గుర్తించి సరిచేసేందుకు స్టేట్‌లెవల్ విజిలెన్స్ కమిటీ రంగంలోకి దిగింది.

## ఆ నలుగురు ఇప్పుడెటూ...

**విజయవాడ, జూలై 16 (ప్రజాస్వరం):**

ఏపీలో రాజకీయాలకు, సినిమా రంగానికి దగ్గర సంబంధం ఉంటుంది. 1983లో టిడిపి ఆవిర్భావంతో.. తెలుగు సినీ పరిశ్రమ సైతం రాజకీయాల వైపు మళ్ళింది. ప్రతి ఎన్నికల్లోను సినీ పరిశ్రమ ప్రభావం చూపింది. కొందరు సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ఎన్నికల్లో పోటీ చేశారు. మరికొందరు పార్టీలకు తమ మద్దతు ప్రకటించారు. ప్రచారం కూడా చేశారు. రాజ్యసభ, ఇతర నామినేటెడ్ పోస్టులు దక్కించుకున్న వారు ఉన్నారు. అయితేసినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు రాజకీయ విమర్శలకు దూరంగా ఉండేవారు. తాము ఉండే పార్టీకి ప్రచారం చేసుకునేవారు కానీ.. ప్రత్యర్థి పార్టీలపై హద్దులు దాటి విమర్శలు చేయలేదు. అయితే గత ఐదేళ్ల వైసిపి హయాంలో .. చాలామంది నటులు రాజకీయ విమర్శలు చేశారు. వారి పరిస్థితి ఇప్పుడు ఏంటి? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.సినీ రంగం నుంచి రోజా అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. సుదీర్ఘకాలం టిడిపిలో కొనసాగారు. వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్ వెంట అడుగులు వేశారు. 2014 ఎన్నికల్లో నగిరి నుంచి పోటీ చేసి గెలిచారు. 2019 ఎన్నికల్లో రెండోసారి విజయం సాధించారు. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కించుకున్నారు. అయితే ఆమె మెగా కుటుంబాన్ని నిత్యం టార్గెట్ చేసేవారు. అయితే ఆమెకు సినీ పరిశ్రమలో అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. ఈటీవీలో వచ్చే జబర్దస్త్ లో జడ్జిగా వ్యవహరించేవారు. ప్రత్యేక కార్యక్రమాల్లో కనిపించేవారు. కానీ మంత్రి అయ్యాక టీవీ షో నుంచి కూడా తప్పుకున్నారు. ప్రస్తుతం ఆమె చేతుల్లో సినిమాలు లేవు. టీవీ షోలు కూడా అవకాశం దక్కే ఛాన్స్ కనిపించడం లేదు.వైయస్ కుటుంబానికి వీర విధేయుడు పోసాని కృష్ణ మురళి. చంద్రబాబుకు బద్ద వ్యతిరేకి. ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావంతో చిరంజీవితో కూడా కలిసి పని చేశారు. కానీ తర్వాత జగన్ పార్టీ పెట్టడంతో అటువైపు మొగ్గు చూపారు. మెగా కుటుంబం పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. చంద్రబాబు పై సైతం విపరీత కామెంట్స్ చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు సీఎం కావడం, పవన్ డిప్యూటీ సీఎంగా ఉండడంతో.. పోసానికి తప్పకుండా సినిమాలు తగ్గుతాయని తెలుస్తోంది. అనవసరంగా వివాదాలు కొని తీర్చుకోవడం ఏంటని నిర్మాతలు పోసానికి ఛాన్స్ ఇచ్చే పరిస్థితి ఉండదని తెలుస్తోంది.వైసీపీకి సపోర్ట్ చేశారు కమెడియన్ అలీ. కానీ ఎన్నడూ రాజకీయ విమర్శలు చేసే వారు కాదు. ప్రత్యర్థులను టార్గెట్ చేసిన సందర్భాలు కూడా లేవు. కేవలం వైసీపీ కోసం మాట్లాడేవారు. ఈ ఎన్నికల్లో ప్రచారానికి కూడా దూరంగా ఉన్నారు. వైసిపి ఓడిపోవడంతో.. ఇక తాను రాజకీయాలనుంచి తప్పుకుంటానని.. ఏ రాజకీయ పార్టీతో తనకు సంబంధం లేదని ప్రత్యేక ప్రకటన ఇచ్చారు. సో అలీ కి కొంత ఇబ్బందులు ఉండవని తెలుస్తోంది. ఆయన చేతిలో సినిమాలతో పాటు టీవీ షో కూడా ఉంది. 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ గతంలో వైసిపికి పనిచేశారు. కానీ ఈ ఎన్నికల్లో మాత్రం కూటమి వైపు నిలిచారు. కూటమికి మద్దతుగా ప్రచారం చేశారు. సో ఆయనకు వచ్చిన ఇబ్బందులు ఏంటి లేవు.బుల్లితెర నటులు ఈసారి క్రియాశీలక పాత్ర పోషించారు. జనసేన తో పాటు కూటమికి ప్రచారం చేశారు. హైపర్ ఆది, కిరాక్ ఆర్పి తదితరులు శ్రమించారు. కిరాక్ ఆర్పి అయితే రాజకీయ విమర్శలు ఎక్కుపెట్టేవారు. ఆయన చేసిన కామెంట్స్ విపరీతంగా వైరల్ అయ్యేవి. ఇప్పుడు కూటమి గెలిచిన తర్వాత కూడా కిరాక్ ఆర్ పి ఒ రేంజ్ లో విమర్శలకు దిగుతున్నారు. ప్రస్తుతం ఆయన బుల్లితెర ప్లాట్‌ఫామ్ పైకేరు. వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఆయన విమర్శల వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. మరోవైపు యాంకర్ శ్యామల మాత్రం అడ్డంగా బుక్కయ్యారు. పిఠాపురంలో పవన్ ఓడిపోతున్నారని, ఏవేవో కథలు కూడా అల్లుతూ వైసిపి అనుకూల మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆమె కెరీర్ కు తప్పకుండా ఇబ్బందికర పరిస్థితులు ఎదురు కావడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి అయితే పవన్ డిప్యూటీ సీఎం కావడంతో సినీ పరిశ్రమ సంతోషంతో ఉంది. కానీ ఆ నలుగురు మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవడం ఖాయంగా తెలుస్తోంది.

## జగన్ ఓవర్ టూ బెంగళూరు...



**విజయవాడ, జూలై 16 (ప్రజాస్వరం):**

జగన్ ఇటీవల తరచూ బెంగళూరు వెళుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒకసారి వెళ్లారు. వారం రోజులపాటు అక్కడే ఉన్నారు. ఇప్పుడు మరోసారి వెళ్తున్నారు. వారం రోజులు పాటు అక్కడే గడపనున్నారు. ఈసారి వైద్య సేవల కోసమే ఆయన బెంగళూరు వెళ్తున్నట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి. అయితే షర్మిల రూపంలో కాంగ్రెస్ పార్టీ నుంచి విమర్శల డోర్స్ పెరగడంతోనే ఆయన బెంగుళూరు వెళుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ద్వారా షర్మిలను కట్టడి చేసేందుకే నన్న టాక్ నడుస్తోంది. అయితే అందులో ఎంత నిజం ఉందో తెలియాలి.జగన్ కు పులివెందులతో పాటు బెంగళూరు, హైదరాబాదులో ప్యాలెస్ లు ఉన్నాయి. అందులో రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు సమకూర్చుకున్నవి కూడా ఉన్నాయి. ముఖ్యంగా హైదరాబాదులోని లోటస్ ఫండ్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించినదే. వైసిపి ఆవిర్భావం కూడా అక్కడి నుంచే ప్రారంభమైంది. ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ కార్యకలాపాలను అక్కడి నుంచే నిర్వర్తించారు జగన్. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత తాడేపల్లిలో ప్యాలెస్ కట్టుకున్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత అదే ప్యాలెస్ కు పరిమితం అయ్యారు. అయితే అప్పటినుంచి లోటస్ ఫండ్ ఖాళీగా ఉంది. షర్మిల ఏపీ నుంచి తెలంగాణ వెళ్లి రాజకీయాలు చేశారు. వైయస్సార్ తెలంగాణ పార్టీని స్థాపించారు. అయితే ఆమె సైతం లోటస్ ఫండ్ నుంచే తన కార్యకలాపాలను మొదలుపెట్టారు. అంటే అది ఉమ్మడి ఆస్తి కనుక.. అందులో తనకు కూడా వాటా ఉందని షర్మిల కోరినట్లు తెలుస్తోంది. రాజశేఖర్ రెడ్డి హయాంలో నిర్మించింది కనుక.. జగన్ సైతం షర్మిల అందులో ఉండేందుకు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది.కేవలం ఆస్తి వివాదాల వల్లే సోదరుడు, సోదరి మధ్య విభేదాలు వచ్చాయి. రాజకీయంగా విభేదించేంతవరకు పరిస్థితి వచ్చింది. ఈ కాంగ్రెస్ పార్టీని ద్వేషించారో అదే పార్టీలోకి షర్మిల వెళ్లాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు అదే షర్మిల ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు తీసుకొని జగన్ పై పోరాడుతున్నారు. గట్టిగానే ఫైట్ చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ లోటస్ ఫండ్ తన ఆధీనంలో ఉంచుకున్నారు. అందుకే జగన్ హైదరాబాద్ వెళ్లడం లేదని తెలుస్తోంది. కేవలం షర్మిల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఒక టాక్ అయితే మాత్రం నడుస్తోంది.బెంగళూరులో విలాసవంతమైన ప్యాలెస్ జగన్ కు ఉంది. రాజకీయాల్లో యాక్టివ్ కాకమునుపే జగన్ బెంగళూరు కేంద్రంగా వ్యాపారాలు చేసేవారు. రాజశేఖర్ రెడ్డి సీఎం అయిన తరువాత వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. అయితే బెంగళూరులో ముచ్చటపడి యలహంక ప్రాంతంలో ఒక ప్యాలెస్ ను కట్టుకున్నారు. అదే ప్యాలెస్ లోకి ఇప్పుడు వెళుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత భార్యతో కలిసి పులివెందుల వెళ్లారు. అక్కడ నుంచి బెంగళూరు చేరుకున్నారు. ఐదు రోజులపాటు అక్కడే గడిపారు. సీఎంగా ఉన్నప్పుడే కాలికి గాయంతో బాధపడ్డారు జగన్. ఇప్పుడు వైద్యం చేసుకునేందుకు మరోసారి బెంగళూరు వెళ్తున్నారు.అయితే బెంగళూరు పర్యటన వెనుక ఎటువంటి రాజకీయ కోణం లేదని వైసీపీ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. హైదరాబాదులోని లోటస్ ఫండ్ షర్మిల ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే జగన్ సైతం హైదరాబాద్ వెళ్లకుండా.. బెంగళూరులో తన సొంత ఇల్లు ఉండడం కారణంగా అక్కడికి వెళుతున్నట్లు సమాచారం. అయితే కేవలం రాజకీయ కోణంలో చూసి.. కాంగ్రెస్ పార్టీతో మంతనాలు సాగించేందుకే తరచూ జగన్ బెంగళూరు వెళ్తున్నట్లు టాక్ నడిచింది. తనను జగన్ కలిశారన్న ప్రచారానికి చెక్ చెప్పారు డీకే శివకుమార్. దానిలో ఎలాంటి నిజం లేదని కూడా తేల్చి చెప్పారు. ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం, ట్రబుల్ షూటర్ గా ఉన్న డీకే శివకుమార్ ఈ తరహా ప్రకటన చేశారంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జగన్ బెంగళూరు వెళుతుంది కేవలం షర్మిల హైదరాబాద్ లోని లోటస్ ఫండ్ స్వాధీనం చేసుకోవడమే కారణమని తెలుస్తోంది. అందులో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి

## కొత్తపాలెంలో ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు

**గోపాలపట్నం, జూలై 16 (ప్రజాస్వరం):**

గోపాలపట్నం కొత్తపాలెం లో ఆర్టీసీ బస్ ను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. దశాబ్ద నాటికల ఈరోజు నెరవేరిందని ఎమ్మెల్యే గణబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాలుగా కొత్తపాలెం ప్రజలు రైల్వే అండర్ పార్త్ బ్రిడ్జి లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. నూతన రైల్వే అండర్ పార్త్ బ్రిడ్జి ద్వారా ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరిందని అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సబ్బవరం వెళ్లే బస్సు వయా చంద్రనగర్ మీదగా వెళ్లడం జరుగుతుందన్నారు. ఈరోజు అండర్ పార్త్ బ్రిడ్జి మీదగా బస్ ట్రయల్ రన్ జరిగింది.

## బాలినేని నైరాశ్యం..

**ఒంగోలు, జూలై 16 (ప్రజాస్వరం):**



మాజీ మంత్రి బాలినేని వైసీపీని వీడుతారా? ఈ విషయాన్ని హై కమాండ్ కు తేల్చి చెప్పారా? అందుకే జగన్ సమీక్షల్లో బాలినేని కనిపించడం లేదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఈ ఎన్నికలకు ముందు నుంచే పార్టీ హైకమాండ్ పై అసంతృప్తితో ఉన్నారు బాలినేని. ఈ ఎన్నికల్లో దారుణంగా పరాజయం పాలయ్యారు. ఇప్పటికీ బాలినేనిని హై కమాండ్ పెద్దగా నమ్మడం లేదు. అందుకే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని నియమించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒంగోలు ఎంపీగా పోటీ చేసిన చెవిరెడ్డి ఓడిపోయారు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై బాలినేని తో పాటు వైసిపి స్థానిక నాయకులు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.బాలినేని శ్రీనివాస్ రెడ్డి జగన్ కు సమీప బంధువు. జగన్ బాబాయ్ వైవి సుబ్బారెడ్డికి స్వయానా బావ అవుతారు బాలినేని. గత ఎన్నికలకు ముందు వైవి సుబ్బారెడ్డి తో బాలినేనికి విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో అప్పటి ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డితో బాలినేని ఐక్యతగా ఉండేవారు. ఒంగోలు ఎంపీ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా మాగుంట, అసెంబ్లీ స్థానం నుంచి బాలినేని పోటీ చేయాలని భావించారు. కానీ బాలినేని విన్నపాన్ని జగన్ అంగీకరించలేదు. దీంతో బాలినేని పార్టీ నుంచి బయటకు వెళ్లిపోతారని ప్రచారం జరిగింది. బాలినేనిని బుజ్జగించారు జగన్. మాగుంట శ్రీనివాసుల రెడ్డికి టికెట్ లేదని చెప్పడంతో ఆయన టిడిపిలో చేరిపోయారు. అయితే అనూహ్యంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తెరపైకి తెచ్చారు జగన్. కానీ ఆయన అభ్యర్థిత్వాన్ని బాలినేని వ్యతిరేకించారు. వైసిపి నాయకత్వం ఒత్తిడి మేరకు వెనక్కి తగ్గారు బాలినేని. ఇప్పుడు ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయంతో బాలినేని పునరాలోచనలో పడ్డారు. సరిగ్గా అదే సమయంలో చెవిరెడ్డికి జిల్లా బాధ్యతలు అప్పగించడంతో.. కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు.2014 ఎన్నికల్లో సైతం బాలినేని ఓడిపోయారు. అప్పుడే నియోజకవర్గానికి కొద్ది రోజులు పాటు దూరంగా ఉండిపోయారు. ఈ న్నికల్లో అంతకుమించి పరాజయం ఎదురు కావడంతో నియోజకవర్గానికి దూరం అవుతారని ప్రచారం జరుగుతోంది. జూన్ 4న ఫలితాలు వస్తే.. దాదాపు 40 రోజుల తర్వాత ఆయన సొంత నియోజకవర్గంలో అడుగుపెడుతున్నారు. అయితే ఆయన ఇప్పుడు ఒంగోలు నగర రాజకీయాల గురించి పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. పార్టీ కార్యక్రమాలకు హాజరు కూడా లేకుండా పోతోంది. నగర మేయర్ తో పాటు మెజారిటీ కార్పొరేటర్లు టిడిపి గూటికి వెళ్లేందుకు సిద్ధపడినట్లు సమాచారం. చాలామంది కార్పొరేటర్లు టిడిపి ఎమ్మెల్యే జనార్ధనకు టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని మేయర్ బాలినేనికి చెప్పగా పెద్దగా పట్టించుకోలేదని సమాచారం.బాలినేని ప్రకాశం జిల్లా బాధ్యతలు తనకు మాత్రమే అప్పగించాలని చాలా సందర్భాల్లో వైసీపీ హై కమాండ్ కు తేల్చి చెప్పారు. కానీ పార్టీ హై కమాండ్ పెద్దగా పట్టించుకోలేదు. జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున అభ్యర్థులను మార్చింది వైసిపి. ఆ సమయంలో సైతం కనీసం సంప్రదించలేదు. బాలినేనిలో అసంతృప్తికి అదే ప్రధాన కారణం. ఆయన సూచించిన మాగుంట శ్రీనివాసుల రెడ్డికి టికెట్ లేదని తేల్చి చెప్పారు జగన్. బాలినేని చెప్పినా వినలేదు. అటు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తెప్పించి నాయకత్వం బాధ్యతలు అప్పగించారు. ఎంపీగా నిలబెట్టారు. ఇప్పుడు జిల్లా బాధ్యతలు అప్పగించాలని చూస్తున్నారు. సహజంగానే ఇది బాలినేనికి మింగుడు పడని విషయం. అయితే బాలినేని వేరే పార్టీలో చేరడానికి సిద్ధపడినట్లు సమాచారం. తాడేపల్లిలో జగన్ నిర్వహించిన సమీక్షలకు సైతం బాలినేని హాజరు కావడం లేదు. ఆయన కూటమిలోని ఏదో ఒక పార్టీలో చేరుతారని తెలుస్తోంది. కానీ ఇంత చేరికలకు సంబంధించి గ్రీన్ సిగ్నల్ రాలేదు. అందుకే వైసిపి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని బాలినేని నిర్ణయించుకున్నట్లు సమాచారం. పార్టీల నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చాక పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి చేరిపోవడం ఖాయంగా తేలుతోంది.బాలినేని పట్టించుకోకపోవడంతో వైసీపీ శ్రేణులు సైతం నైరాశ్యంలోకి వెళ్లిపోయాయి. చివరకు వైయస్సార్ జయంతి వేడుకలకు కూడా మెజారిటీ నాయకులు హాజరు కాలేదు. ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ సుజాతతో పాటు మెజారిటీ కార్పొరేటర్లు కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. గతంలో వీరంతా సమావేశం అయ్యారు. బాలినేనిని సంప్రదించారు. కానీ ఆయన రాజకీయాలంటేనే విరక్తి అన్న రీతిలో మాట్లాడారు. అందుకే వారంతా ఎమ్మెల్యే జనార్ధన్ టచ్ లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. పార్టీ హై కమాండ్ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వీరు టిడిపిలోకి చేర్చుకోవడం ఖాయం. అయితే బాలినేని వ్యవహారం ఎవరికీ అంతుపట్టడం లేదు. వీలైనంతవరకు పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండి.. ఏదో ఒక పార్టీలో చేరడం ఖాయమని తెలుస్తోంది

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై కార్తీక్ రెడ్డి ఫైర్

**రంగారెడ్డి, జూలై 16 (ప్రజాస్వరం):**

కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై బీఆర్ఎస్ సీనియర్ నేత కార్తీక్ రెడ్డి తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. నియోజకవర్గం లోని విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసిన కొందరు వాటిని కబ్జా చేయాలని దురుద్దేశంతోనే అధికార పార్టీలోకి జంప్ అయ్యారని కార్తీక్ రెడ్డి పరోక్షంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ప్రకటించారు. శంషాబాద్ లోని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన కార్తీక్ రెడ్డి... ప్రకాష్ గౌడ్ పార్టీ ఫిరాయించాలని తీవ్రంగా తప్పుపట్టారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి 4500 కోట్లు కేటాయించారని స్వయంగా ప్రకటించిన ప్రకాష్ గౌడ్ ఇప్పుడు ఏమి ఆశించి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు ప్రజలకు సమాధానం చెప్పాలని కార్తీక్ రెడ్డి కార్తీక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కేవలం కేసీఆర్ ముఖం చూసి ఓట్లు వేసి ఎమ్మెల్యేలుగా గెలిపించారు తప్ప వారిని చూసి కాదని కార్తీక్ రెడ్డి పరోక్షంగా ప్రకాష్ గౌడ్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయించిన నేతలందరికీ ప్రజలే తగిన రీతిలో గుణపాఠం చెబుతారని ఆయన జోస్యం చెప్పారు.

## శాంతి ఎపిసోడ్ వెనుక సొంత పార్టీ నేతలు

**విశాఖపట్టణం, జూలై 16 (ప్రజాస్వరం):**

విజయసాయిరెడ్డి ప్రతిష్టను సొంత పార్టీ నేతలు డ్యామేజ్ చేస్తున్నారా? మానసికంగా దెబ్బతీయాలని చూస్తున్నారా? ఇబ్బంది పెట్టాలని భావిస్తున్నారా? ఆయనపై తాజా ఆరోపణల వెనుక సొంత పార్టీ నేతల హస్తం ఉందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. విజయసాయిరెడ్డి తాజా వ్యాఖ్యలు చూస్తుంటే ఇదే అర్థమవుతోంది. ఓ మహిళా అధికారిపై ఆయన భర్త చేసినఆరోపణల నేపథ్యంలో.. విజయసాయిరెడ్డి ప్రస్తావన రావడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయింది. మీడియాలో సైతం విస్తృత చర్చకు కారణమైంది. దీనిపై విజయసాయిరెడ్డి స్పందించారు. స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు.వైసీపీలో నెంబర్ 2గా ఏదిగారు విజయసాయిరెడ్డి. ఆ స్థానానికిచాలా పెద్ద పోటీ ఉంది. వైసిపి ఆవిర్భావ సమయంలో నెంబర్ 2 గా ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఉండేవారు. తెలంగాణకు చెందిన గోనె ప్రకాష్ రావు, కొండా సురేఖ సైతం జగన్ ను అనుసరించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు వైసీపీలో నెంబర్ 2 స్థానం మారిపోతూ వచ్చింది. అయితే అధికారంలోకి వచ్చిన నాటికి విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వంటి వారి మధ్య విపరీతమైన పోటీ ఉండేది. ముఖ్యంగా విజయసాయిరెడ్డి ప్రాధాన్యతను తగ్గించి.. ఆ స్థానానికి వచ్చారు సజ్జల రామకృష్ణారెడ్డి. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఎనలేని ప్రాధాన్యత దక్కించుకున్నారు. జగన్ సైతం సకల శాఖలను ఆయనకే అప్పగించారు. చివరకు విజయసాయిరెడ్డిని ఉత్తరాంధ్ర సమన్వయకర్త పదవి నుంచి తొలగించారు. ఆ పదవిని తన బాబాయి వైవి సుబ్బారెడ్డి కి అప్పగించారు. సోషల్ మీడియా విభాగం నుంచి సైతం తప్పించారు. ఆ బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు భార్గవ రెడ్డికి అప్పగించారు. అయితే పార్టీలో జరిగిన ఈ పరిణామాలతో కొద్దిరోజుల పాటు విజయసాయిరెడ్డి సైలెంట్ అయ్యారు. పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం తగ్గించారు.నందమూరి తారకరత్న మరణంతో చంద్రబాబు, బాలకృష్ణ లను విజయసాయిరెడ్డి కలవాల్సి వచ్చింది. విజయసాయిరెడ్డి మరదలు కుమార్తె అలేఖ్య రెడ్డి తారకరత్న భార్య. తారకరత్న మరణంతో వారికి అండగా నిలవాల్సిన పరిస్థితి విజయసాయి రెడ్డి పై ఏర్పడింది. తారకరత్న నందమూరి కుటుంబ సభ్యుడు కావడంతో చంద్రబాబుతో పాటు బాలకృష్ణ కూడా పాల్గొన్నారు. ఆ సమయంలో చంద్రబాబుతో పాటు బాలకృష్ణతో సన్నిహితంగా గడిపారు విజయసాయిరెడ్డి. దీంతో అప్పట్లో ఒక ప్రచారం బలంగా జరిగింది. వైసిపి శ్రేణులు సైతం విజయ సాయి రెడ్డిని అనుమానంగా చూశాయి. కానీ క్రమేపి ఆ అనుమానాలు తగ్గాయి. తిరిగి విజయసాయిరెడ్డి యాక్టివ్ అయ్యారు. నెల్లూరులో వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి టిడిపిలోకి వెళ్లిపోవడంతో.. జగన్ విజయసాయిరెడ్డి ని ఆశ్రయించాల్సి వచ్చింది. నెల్లూరు ఎంపీ స్థానానికి పోటీ చేయాల్సి వచ్చింది. అక్కడ ఓటమి గ్యారెంటీ అని తెలిసినా తనను ప్రయోగించడం పై విజయసాయిరెడ్డి కూడా బాధపడినట్లు తెలుస్తోంది. అందుకే ఓటమి తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం.అయితే తాజాగా ఓ మహిళ అధికారి గర్భం విషయంలో తన పేరు బయటకు రావడానికి విజయసాయిరెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. రాజకీయ ప్రత్యర్థులతోపాటు తనతో గిట్టని సొంత పార్టీ వారిపై సైతం అనుమానం వ్యక్తం చేశారు. సొంత పార్టీ వారే టిడిపితో కుమ్మక్కై ఈ కుట్రకు తెర లేపారని ఆయన మీడియా ముందు ఓపెన్ కావడం గమనార్హం. సదరు మహిళా అధికారి వైసిపి నాయకుల సిఫారసులకు పెద్దపీట వేస్తారన్న విమర్శలు ఉన్నాయి. వైసిపి హయాంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. వైసిపి పెద్దలతో ఆమెకు మంచి సంబంధాలే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు పని గట్టుకొని విజయసాయి రెడ్డి పై ఆరోపణలు రావడం వెనుక వైసీపీ నేతల హస్తం ఉందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. విజయసాయిరెడ్డి సైతం ఇదే తరహా అనుమానాలు వ్యక్తం చేస్తుండడం విశేషం. మున్ముందు ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో చూడాలి.

## బాలిక అనుమానాస్పద మృతి

### నిందితుడి కోసం పోలీసుల గాలింపు

**గుంటూరు, జూలై 16 (ప్రజాస్వరం):**

చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోనీ కొత్తరెడ్డి పాలెం గ్రామంలోని ప్రభుత్వపాఠశాలలో 7వ తరగతి చదువుతున్న బాలిక సోమవారం ఉదయం స్కూలుకి వెళ్లి అనారోగ్యంగా ఉందంటూ స్కూల్ నుండి వెళ్లిన బాలిక స్కూల్ టైం గడిచిపోయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో గ్రామంలో తల్లిదండ్రులు, స్థానికులు వెతుకుతుండగా గ్యాస్ గోడౌన్ లో పనిచేసే నాగరాజు ఇంటికి వెళ్లినట్టు తెలియడంతో బాలిక అన్నయ్య అతని ఇంటి కిటికీ నుంచి చూడగా బాలిక నిర్జీవంగా పడి ఉండడం కనిపించింది. దాంతో తలుపులు పగలకొట్టి బాలికను పరిశీలించగా అప్పటికే బాలిక మృతి చెందినట్టు స్థానికులు, తల్లిదండ్రులు గుర్తించారు. వెంటనే చేబ్రోలు పోలీస్ వారికీ ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నరు. సంఘటన స్థలాన్ని తెనాలి డిఎస్పి రమేష్ సందర్శించి వివరాలు సేకరిస్తున్నారు. నిందితడికి కోసం గాలిస్తున్నారు.

# డార్లింగ్ ప్రీ రిలీజ్ ఈవెంట్

## సనిమా విజయం సాధించాలన్న నాని

ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ 'డార్లింగ్'మూవీకి అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపధ్యంలో చిత్ర యూనిట్ ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. నేచురల్ స్టార్ నాని అతిధిగా హాజరైన ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్ గా జరిగింది. నాని మాట్లాడుతూ 'డార్లింగ్ టీజర్, ట్రైలర్ చాలా ఎంటర్ టైనింగ్ గా వున్నాయి. ఈ మధ్య యాక్షన్ సినిమాలు ఎక్కువైపోయి కామెడీ, లవ్ స్టొరీలని మిస్ అవుతున్నాం. లాస్ట్ ఇయర్ లవ్ స్టొరీ, ఎమోషన్ కలిపి హాయ్ నాన్నతో వచ్చాను. ఈ ఏడాది దర్శి లవ్ స్టొరీ, కామెడీ కలిపి డార్లింగ్ తో వస్తున్నారు. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ కావాలి. కామెడీ, ఎమోషన్, లవ్, యాక్షన్..ఇలా అన్నీ జోనర్ సినిమాలు రావాలి. దర్శి లాంటి ట్యాలెంటెడ్ యాక్టర్ అలాంటి డిఫరెంట్ స్జబెక్ట్స్ సెలెక్ట్ చేసుకోవడం చాలా హ్యాపీగా వుంది. స్ప్లిట్ పర్సనాలిటీ కాన్సెప్ట్ అదిరిపోయింది. లేడి అపరిచితుడు. ఇలాంటి కాన్సెప్ట్ తో సరిగ్గా చేస్తే ఎంత లాఫ్టర్ జనరేట్ చేయొచ్చో వూహించగలను. ట్రైలర్ చూస్తుంటే పర్ఫెక్ట్ ఎంటర్ టైనర్ అనిపిస్తుంది. ఇది అద్భుతంగా వుండాలని కోరుకుంటున్నాను. దర్శి అంటే నాకు చాలా ఇష్టం. హాయ్ నాన్న గోవా షూటింగ్ లో ఓ రోజు సరదాగా బయటికి వెళ్లాం. సరదాగా కబుర్లు చెప్పకున్నాం. తను చేసే నటన, పాత్రలు ఇష్టం. ఈ డికేడ్ లోనే నాకు మోస్ట్ ఫేవరేట్ ఫిల్మ్ బలగం. బలగం హీరో ఫ్యాన్ గా ఈ ఈవెంట్ కి వచ్చాను. డార్లింగ్ కూడా దర్శి కెరీర్ లో ఒక మైల్ స్టోన్ అవ్వాలని కోరుకుంటున్నాను. డార్లింగ్ టీం అందరికీ ఆల్ ది బెస్ట్' తెలిపారు. ప్రియదర్శి మాట్లాడుతూ 'చిన్నప్పడు చిరంజీవి గారిని చూసి యాక్టర్ కావాలని ఇన్స్పిరేషన్ అయితే ఇప్పడు నాని అన్న ఇన్స్పిరేషన్. ఎలాంటి బ్యాగ్ గ్రౌండ్ లేకుండా సినిమాల్లోకి రావాలనుకునే ఇప్పటి జనరేషన్ కి నాని ఇన్స్పిరేషన్. కల్కి సినిమాలా ఆలోచిస్తే నాని అన్న రధం నడిపే కృష్ణుడైతే ఆ దారిలో వెళ్ళే అర్జునుడిలా, నానిని ఫాలో అవుతున్నా. ఇంత ఇన్స్పిరేషన్ ఇస్తున్నందుకు థాంక్ యూ. డార్లింగ్ తో తెలుగు సినిమా అశ్విన్ ని అడాప్ట్ చేసుకుంటుంది. నభా తీసుకొచ్చిన స్పిరిట్ ట్యాలెంట్ రాఘవ క్యారెక్టర్ ని మోటివేట్ చేసింది. తను రెండేళ్ళ తర్వాత ఒక ఫ్లేమ్ లా తిరిగొచ్చారు. ఇక నుంచి తిరుగుండదు. ప్రేక్షకుడు ఇచ్చిన టైమ్ కి వాల్యూ యాడ్ చేయాలని అనుకుంటా. ఒక మంచి సినిమా మీకు మళ్ళీ తిరిగివ్వాలి. మీరు మాకిస్తున్న ప్రేమని రెండితలు తిరిగివ్వాలని నేను అనుకుంటున్నాను' అన్నారు. డైరెక్టర్ అశ్విన్ రామ్ మాట్లాడుతూ 'కొత్త దర్శకులకు కొత్త కథలు రాసుకునే స్పూర్తిని నమ్మకాన్ని ఇచ్చే హీరో నాని గారు. . మా ప్రొడ్యూసర్స్ నిరంజన్ గారు, చైతన్య గారు కంటెంట్ ని బలంగా నమ్మారు. చాలా సపోర్ట్ చేశారు. డార్లింగ్ నాకు చాలా స్పెషల్ ఫిలిం. దర్శి సపోర్ట్ మర్చిపోలేను. కంటెంట్ ని చాలా స్టాం÷-రగ్ గా నమ్మారు. డార్లింగ్ లో కొత్త నభాని చూస్తారు' అన్నారు. నభా నటేష్ మాట్లాడుతూ 'డార్లింగ్ సినిమా నాకు ఓ ఎమోషన్. ఇందులో నా డ్రీం రోల్ చేశాను. అశ్విన్ అద్భుతమైన స్క్రిప్ట్ రాశారు. ఇంకా గొప్పగా తీశారు. జూలై 19న డార్లింగ్ మ్యాజిక్ చూస్తారు. దర్శితో నటించడం వండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్ అన్నారు. యాక్టర్ అభినవ్ గోమఠం మాట్లాడుతూ..డార్లింగ్ టీజర్ ట్రైలర్ ప్రామెసింగ్ గా వున్నాయి. వివేక్ సాగర్ సూపర్ మ్యూజిక్ ఇచ్చారు. అశ్విన్ ఆల్ ది బెస్ట్. తను చాలా కమర్షియల్ గా సినిమా చేశాడు. దర్శి హార్డ్ వర్క్ రిజల్ట్ దొరుకుతుంది. నభా క్యారెక్టర్ చాలా బావుంది. చాలా మంచి టీం. హనుమాన్ సక్సెస్ ని డార్లింగ్ కంటిన్యూ చేస్తుంది' అన్నారు.




## పుష్ప2' తర్వాత అల్లు అర్జున్ ఎవరితోనో?




పుష్ప2' తర్వాత అల్లు అర్జున్ చేయబోయే సినిమాపై ఇంకా స్పష్టత రాలేదు. కథలు వినిపించారంటూ సందీప్‌రెడ్డి వంగా, అట్లీ, త్రివిక్రమ్.. ఇలా చాలా మంది పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. 'పుష్ప2' తర్వాత అల్లు అర్జున్ చేయబోయే సినిమాపై ఇంకా స్పష్టత రాలేదు. కథలు వినిపించారంటూ సందీప్‌రెడ్డి వంగా, అట్లీ, త్రివిక్రమ్.. ఇలా చాలా మంది పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఒకవైపు అల్లు అర్జున్ 'పుష్ప2'లో నటిస్తూనే, మరోవైపు ఆ తర్వాత సినిమా కోసం కథా చర్చలు కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. 'పుష్ప 2' తర్వాత అందుకు దీటైన కథల్నే ఎంచుకునే ప్రయత్నాల్లో ఉన్నారాయన. ఇటీవలే మరో దర్శకుడు కలిసి అల్లు అర్జున్‌కి కథ వినిపించినట్టు తెలుస్తోంది. ఆయనే 'జైలర్' ఫేమ్... నెల్సన్. మరి ఈ కలయికలో సినిమా ఉంటుందా? అది 'పుష్ప 2' తర్వాతే ఉండొచ్చా? అనే విషయాలపై స్పష్టత రావల్సి ఉంది. అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ కూడా బన్నీ కోసం పురాణాలతో ముడిపడిన ఓ కథని సిద్ధం చేసినట్టు సమాచారం. మరి అల్లు అర్జున్ ఎవరి కథవైపు మొగ్గు చూపుతారనేది ఇప్పడు ఆసక్తికరంగా మారింది.

## ఆసక్తికరంగా కిరణ్ అబ్బవరం టీజర్



కిరణ్ అబ్బవరం పుట్టినరోజు సందర్భంగా అతను నటించిన 'క' సినిమా టీజర్ విడుదలైంది. కిరణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేసిన సినిమా ఈ 'క'. దీనికి సుజీత్, సందీప్ ద్వయం దర్శకత్వం వహించారు, చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మాత. టీజర్ చూస్తే ఈ సినిమాలో విషయం వున్నట్టుగా కనపడుతోంది, అలాగే ఇది వైవిధ్యమైన కథతో వస్తున్నట్టుగా కూడా అర్థం అవుతోంది. సాయంత్రం మూడు గంటలకే చీకటి పడుతున్న కృష్ణగిరి అనే వూరిలో ఏమి జరుగుతోంది. ఆ వూరిలో జరుగుతున్న మిస్టరీ ఏంటి. సినిమాలో పోస్ట్ మేన్ గా కనపడిన కిరణ్ అబ్బవరం చాలా కొత్తగా కనపడుతున్నాడు. అతను ఇంతకు ముందు చేసిన సినిమాలకి ఈ సినిమాలో చేసిన పాత్రకి చాలా వైవిధ్యం కనపడుతోంది. పోస్ట్ మేన్ ఎందుకు ఇతరులకి వచ్చే ఉత్తరాలు చదువుతున్నారు, ఎవరు అతను, ఆ వూరు ఏదైనా పనిపైన వచ్చాడా? చాలా ఆసక్తికరంగా వున్న 'క' టీజర్. త్వరలోనే విడుదల కానున్న ఈ సినిమా తెలుగుతో పాటు, కన్నడ, మలయాళం, తమిళం, హిందీ భాషల్లో కూడా విడుదలవుతోంది.



## సుదీప్ మ్యాక్స్ టీజర్ విడుదల

కన్నడ నటుడు కిచ్చా సుదీప్ నటించిన 'మ్యాక్స్' సినిమా నుండి టీజర్ విడుదలైంది. విజయ్ కార్తికేయ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి అజనీష్ లోక్ నాథ్ సంగీతం అందించారు. సుదీప్ రెండు కత్తులను పట్టుకొని తనపైకి వచ్చిన వాళ్ళని నరకడానికి వెళుతూ ఉండటాన్ని ఎలివేట్ చేస్తూ చూపించారు. తెలుగు నటుడు సునీల్, వరలక్ష్మి శరత్ కుమార్ లు ఈ సినిమాలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్టుగా ఈ టీజర్ చూస్తే అర్థం అవుతోంది. ఇదొక యాక్షన్ నేపథ్యంలో వచ్చే సినిమాగా అర్థం అవుతోంది.

## రాజ్ తరుణ్‌కు నార్సింగి పోలీసులు నోటీసులు

హైదరాబాద్: హీరో రాజ్ తరుణ్‌కు నార్సింగి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ప్రియురాలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదుపై రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణకు రావలసిందిగా తాఖీదులి చ్చారు. ఈనెల 18 లోపు తమ ఎదుట హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. బీఎన్ఎస్ఎస్ 45 కింద రాజ్ తరుణ్‌కు నోటీసులు జారీ చేశారు. హీరో రాజ్‌తరుణ్, తాను పదకొండేండ్లుగా ప్రేమించు కుంటున్నామని, అనేకసార్లు శారీరకంగా కలిశామని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు వదిలించుకునేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొంది. ఓ హీరోయిన్‌తో ప్రేమాయణం నడుపుతూ, తనను మోసం చేయాలని చూస్తున్నాడని వాపోయింది. రాజ్‌తరుణ్‌ను వదిలేయాలని లేకపోతే తనను చంపేస్తానంటూ, అతడి సోదరుడు ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడుతు న్నాడని వెల్లడించింది. గతంలో డ్రగ్స్ కేసులో తనను ఇరికించారని, రాజ్‌తరుణ్ కోసం తాను 45 రోజులపాటు జైలులో ఉన్నానని తెలిపింది. రాజ్‌తరుణ్ విచ్చలవిడిగా డ్రగ్స్‌కు అలవాటుపడి అమ్మాయిలతో పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తున్నారంటూ 4 పేజీల ఫిర్యాదును నార్సింగి పోలీసులకు అందజేసింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఏ 1 గా రాజ్ తరుణ్, ఏ2 గా మాల్వి మల్హోత్రా, ఏ3గా మయాంక్ మల్హోత్రాన్ని చేర్చుతూ నార్సింగ్ పోలీసులు ఇటీవల కేసు నమోదు చేశారు. ఐపీసీ 420, 493, 506 సెక్షన్ల కింద ముగ్గురిపైనా కేసు నమోదు అయ్యింది. ఈ నెల 13న లావణ్య ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే.




Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154